సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 12-08-2022 ₹15/-




# తాయిలాల రాజకీయాలు



గాంధీతో భుజం భుజం కలిపి

## యువ చైతన్యం



సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 32 హైదరాబాద్
శుక్రవారం 12 ఆగస్టు 2022 రూ.15-00
13 ముహర్రం 1444 హిజ్రీ

**తొలిగీటు**

అన్యాయాన్ని, అక్రమాన్ని మన్నించి వేస్తే అల్లాహ్ తప్పనిసరిగా ఆ వ్యక్తి గౌరవాన్ని ద్విగుణీకృతం చేస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



## ముహర్రం సందేశం ...... 24

## లోపల...

| | | |
|---|---|---|
| ఇస్లామిక్ బ్యాంకింగ్ | ...... | 04 |
| తాయిలాల రాజకీయాలు | ...... | 05 |
| గాంధీతో భుజం భుజం కలిపి.... | ...... | 08 |
| చరితార్థులు– ముహమ్మద్ రజబ్ అలీ | ...... | 11 |
| అపార్థాల మబ్బుల్లో ముస్లిములు | ...... | 12 |
| నైతిక సంక్షోభంలో దైవాదేశాలే దిక్సూచి | ...... | 14 |
| ఉద్యమాలతోనే గిరిజన హక్కుల పరిరక్షణ | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మదీనాలో యూదులు | ...... | 21 |
| మరో జీవితం సాధ్యమా? | ...... | 26 |
| జీవిత లక్ష్యం | ...... | 28 |
| యువ చైతన్యం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అధర్మమైన సొమ్ము | ...... | 34 |

**కోమటిరెడ్డి కూడా...**



తమ్ముడి దారిలోనె
అన్నగూడ పయనం
రేవంతుడి దూకుడే
మార్చిందట నిర్ణయం!
క్షమాపణ చెప్పెదాక
వదలడంట బాసు
హైకమాండు దృష్టికి
వెళ్ళిందట ఈ కేసు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# ఇస్లామిక్ బ్యాంకింగ్

**రష్యా** కూడా ఇప్పుడు ఇస్లామిక్ బ్యాంకులకు తలుపులు తెరిచింది. పాశ్చాత్య ఆంక్షల వల్ల దెబ్బతిన్న రష్యా బ్యాంకింగ్ వ్యవస్థకు ఇది కొత్త బలాన్నిస్తుందని ఆశిస్తున్నారు. ఇస్లామిక్ బ్యాంకింగ్ వల్ల ముస్లిం దేశాల నుంచి అనేక మంది డిపాజిటర్లు లభిస్తారని భావిస్తున్నారు. ఇస్లామిక్ బ్యాంకింగ్ రష్యా సెంట్రల్ బ్యాంకు పరిధిలో పని చేస్తుంది.

ఇస్లామిక్ బ్యాంకులు షరీఅత్ నియమాల ప్రకారం పనిచేస్తాయి. వడ్డీకి ఇస్లామిక్ బ్యాంకుల్లో అనుమతి లేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామిక్ బ్యాంకింగ్ ఏటా 14 శాతం అభివృద్ధి రేటు నమోదు చేస్తోంది. దాదాపు రెండు ట్రిలియన్ డాలర్ల వరకు చేరుకుంది.

రష్యాలో ఇస్లామిక్ బ్యాంకింగు గురించిన చర్చ చాలా కాలం నుంచి కొనసాగుతోంది. నవంబర్ 2014లోనే ఇస్లామిక్ బ్యాంకింగ్ విషయంలో ఆలోచనలు మొదలయ్యాయి. రష్యా ఇప్పుడు ఇస్లామిక్ బ్యాంకింగ్ వైపు దృష్టిపెట్టడానికి ప్రధానమైన కారణం ఉక్రెయిన్ యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితులు. రష్యాపై అమెరికా పాశ్చాత్య దేశాల ఆంక్షల వల్ల తలెత్తిన పరిస్థితి నుంచి బయటపడడానికి రష్యా ప్రయత్నిస్తోంది.

ప్రపంచంలో ఇస్లామిక్ బ్యాంకింగ్ ఎక్కువగా ముస్లిం దేశాల్లోనే ఉంది. కాని పాశ్చాత్య దేశాల్లో కూడా ఇస్లామిక్ బ్యాంకింగ్ నెమ్మదిగా విస్తరిస్తోంది. బ్రిటన్లో 2004లోనే ఇస్లామిక్ బ్యాంకింగ్ అడుగుపెట్టింది.

కోవిడ్ తర్వాత ఇస్లామిక్ బ్యాంకింగ్ అవకాశాలు మరింత పెరిగాయి. ఇస్లామిక్ బ్యాంకింగ్ రిస్క్ షేరింగ్, నైతికతలపై ఆధారపడింది. సంక్షోభ సమయాల్లో పేదల ప్రయోజనాలు కాపాడడానికి అనువైనదిగా గుర్తింపు పొందింది. 2011 నుంచి 2021 మధ్య కాలంలో బ్రిటన్లో ఇస్లామిక్ బ్యాంకింగ్ చాలా విస్తరించింది. బ్రిటన్ మాత్రమే కాదు, అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, కెనడా, జర్మనీ తదితర దేశాల్లో కూడా ఇస్లామిక్ ఆర్థిక సంస్థలు సేవలందిస్తున్నాయి. ముస్లిం ప్రపంచానికి బయట ఇతర దేశాల్లో ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పడడం 2004లో ప్రారంభమైంది. మొదట బ్రిటన్ ఇస్లామిక్ బ్యాంకింగ్ కు తలుపులు తెరిచింది.

ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం తర్వాత చాలా దేశాలు ఇస్లామిక్ బ్యాంకింగ్ వైపు దృష్టిసారించాయి. సాంప్రదాయిక బ్యాంకులకు ప్రత్యామ్నాయ వ్యవస్థగా ఇస్లామిక్ బ్యాంకింగ్ ముందుకు వచ్చింది. సాంప్రదాయిక బ్యాంకులు రుణాలు ఇవ్వడం ద్వారా వాటిపై వడ్డీల ద్వారా పనిచేస్తాయి. ప్రారంభంలో చాలా మంది ఆర్థికవేత్తలు వడ్డీకి అవకాశం లేని ఇస్లామిక్ బ్యాంకింగ్ మనుగడ సాగించడం చాలా కష్టమనుకున్నారు. కాని ఈ భయసందేహాలు ఇప్పుడు పటాపంచలయ్యాయి. ఇస్లామిక్ బ్యాంకింగ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.

ఇస్లామిక్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడడానికి కారణమేమిటి? సంక్షోభ సమయాల్లో ఇస్లామిక్ బ్యాంకింగ్ ఎలా ప్రతిస్పందిస్తుంది మొదలైన అంశాలపై లోతైన పరిశోధనలు జరగవలసి ఉంది. చాలా మంది ఇస్లామిక్ బ్యాంకింగ్ అంటే కేవలం ముస్లిములకు సంబంధించింది అనుకుంటారు. కాని ఇస్లామిక్ బ్యాంకింగ్‌లో అందరికీ అవకాశాలున్నాయి.

భారతదేశంలో ఇస్లామిక్ బ్యాంకింగును అనుమతించే అవకాశాలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఇండియాలో ఇస్లామిక్ బ్యాంకులు లేవు కాని, బ్యాంకేతర ఆర్థిక సంస్థలు, కోఆపరేటివ్ సంస్థలున్నాయి. కేరళలోని కోఆపరేటివ్ బ్యాంకుల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అబ్దుల్ వాహెద్




# తాయిలాల రాజకీయాలు

**ప్రతిపక్షాలు** తాయిలాల రాజకీయాలు నడుపుతున్నాయని ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల విమర్శించారు. కాని ఆలోచించ వలసిన విషయమేమిటంటే, బీజేపీ పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఎలాంటి రాజకీయాలు నడుస్తున్నాయి? అక్కడ పరిస్థితులు చాలా గొప్పగా ఉన్నాయా?

ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లా ఓరాయ్ సమీపంలోని కైతేరి గ్రామంలో నాలుగు లేన్ల బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ ఈ విమర్శలు చేశారు. ఓట్ల కోసం తాయిలాలిచ్చే సంస్కృతి దేశాభివృద్ధికి చాలా ప్రమాదకరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు.

ఉత్తర ప్రదేశ్‌లో రహదారుల అనుసంధానం లేకపోవడానికి కారణం గత ప్రభుత్వాలేనని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఒకే పార్టీ (అంటే బీజేపీ) ప్రభుత్వాలు ఉన్నాయని ఇవి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలని అన్నారు. అనుసంధానం వేగంగా జరుగుతోం దని, రాష్ట్రం గొప్పగా పరివర్తన చెందుతోందన్నారు. బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వే వల్ల చిత్రకూట్-ఢిల్లీ మధ్య ప్రయాణ దూరం తగ్గడంతో మూడు నుంచి నాలుగు గంటల సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ వే వల్ల ప్రయోజనాలు చాలా ఉన్నాయని చెప్పారు.

ఈ ఎక్స్‌ప్రెస్ వే కేవలం వాహనాల వేగాన్ని పెంచడం మాత్రమే కాకుండా యావత్తు బుందేల్‌ఖండ్‌లో పారిశ్రామిక అభివృద్ధి పుంజు కుంటుందని తెలిపారు. తాయిలాల సంస్కృతి దేశాభివృద్ధికి అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ప్రజలు మరీ ముఖ్యంగా యువత తాయిలాల సంస్కృతి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ఉత్తరప్రదేశ్ గొప్పగా అభివృద్ధి చెందుతోందన్నారు. శాంతిభద్రతల పరిస్థితి మెరుగు పడిందని రహదారుల అనుసంధానం వేగంగా మెరుగుపడుతోందని చెప్పారు. గతంలో వీటి పరిస్థితి ఎలా ఉండేదో ఓసారి గుర్తు చేసుకో వాలని ప్రజలను కోరారు. ఉత్తర ప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. తాము కేవలం వర్తమానం

కోసం నూతన సదుపాయాలను సృష్టించడం మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్మిస్తున్నామని అన్నారు.

“దేశంలో తాయిలాలు పంచి ఓట్లు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ తాయిలాల సంస్కృతి దేశాభివృద్ధికి చాలా ప్రమాదకరం. దీని పట్ల దేశ ప్రజలు ముఖ్యంగా యువత జాగ్రత్తగా ఉండాలి. తాయిలాలిచ్చే వారు మీ కోసం ఎక్స్‌ప్రెస్ వేలు విమానాశ్రయాలు లేదా రక్షణ కారిడార్‌లను నిర్మించరు.” అంటూ ఆయన చేసిన విమర్శలపై ఇప్పుడు ప్రతివిమర్శలు మొదలయ్యాయి.

తాయిలాల రాజకీయాలపై వ్యంగ్యంగా విమర్శలు ఇటీవల చాలా ఎక్కువగానే వినిపిస్తున్నాయి. ఈ విమర్శలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా మండిపడ్డారు.

ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిచడం తప్పా? అని ప్రశ్నించారు. ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నాం.. అద్భుతమైన మొహల్లా క్లినిక్‌లను నిర్మించాం. దాదాపు 2 కోట్ల మంది ఉచిత చికిత్స పొందగలిగే ఏకైక మెగాసిటీ ఢిల్లీ అనీ, ఇక్కడ 50 లక్షల వరకు శస్త్ర చికిత్సలు జరిగాయని సీఎం కేజ్రీవాల్ అన్నారు.

అలాగే.. దేశంలో ఎక్కడ లేని విధంగా.... ఉన్నత ప్రమాణాలతో ఉచిత విద్యను అందిస్తున్నామని, గతంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉండేదని విమర్శించారు. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది పిల్లలు చదువుతున్నారని, నేడు పేదల పిల్లలు నీట్, జేఈఈలో ఉత్తీర్ణులవుతున్నారనీ, వేల మంది పిల్లల భవిష్యత్తును మార్చామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించడం తప్పా? అని ప్రశ్నించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం ఓట్ల కోసం తాయిలాలు కావని అన్నారు.

మన దేశంలోని పిల్లలకు ఉచితంగా, నాణ్యమైన విద్యను అందించాలని, ప్రజలకు మంచి, ఉచిత వైద్యం అందించాలని, ఉచితంగా అందించే ప్రతి వాటిని ఓట్ల కోసం అందించే తాయిలాలు అనడం సరికాదన్నారు. అభివృద్ధి చెందిన, అద్భుతమైన భారతదేశానికి పునాది వేస్తున్నామనీ, 75 ఏళ్ల క్రితమే ఈ పని చేయాల్సి ఉండేననీ, ఈ రోజు ఈ పిల్లల భవిష్యత్తును మనం చక్కదిద్దితే.. నేరం చేస్తున్నట్టా? అని ప్రశ్నించారు.

ఓట్ల కోసం అందించే తాయిలాల గురించి అరవింద్ కేజ్రీవాల్ వివరించారు. ఓ కంపెనీ చాలా బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని డబ్బులు మాయం చేసింది. బ్యాంకు దివాళా తీసిందని, ఆ కంపెనీ ఒక రాజకీయ పార్టీకి కోట్లాది రూపాయలను విరాళంగా ఇచ్చిందని, ఆ కంపెనీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది. ఇది తాయిలం అని అన్నారు.

ప్రధాని మోడీ డబుల్ ఇంజన్ సర్కారు గురించి ఇక్కడ తెలంగాణాలో కూడా చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే ఇక అభివృద్ధి బుల్లెట్ రైలు మాదిరి పరుగులు పెడుతుందన్న అభిప్రాయం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. డబుల్ ఇంజన్ సర్కారు ఉన్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పని తీరును పొరుగునే ఉన్న ఢిల్లీ సర్కారు పనితీరుతో పోల్చి చూద్దాం.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారాలు లేవు. లెఫ్టినెంట్ గవర్నర్ గారి జోక్యం ఉంటుంది. ప్రాథమిక విద్య, ప్రజారోగ్యం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో ఆప్ పార్టీ ప్రభుత్వం అద్భుతమైన పనితీరు చూపించింది. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తన మొదటి బడ్జెట్‌లోనే విద్యకు ప్రభుత్వ కేటాయింపులను 106% పెంచినట్లు ప్రకటించింది. నిధుల పెరుగుదల వల్ల ఢిల్లీ అంతటా 8,000 కొత్త తరగతి గదులను నిర్మించగలిగారు. 12,000 కంటే ఎక్కువ తరగతి గదులకు ప్రయోగశాలల వంటి కొత్త సౌకర్యాలు సమకూర్చారు. సింగపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు 200 మందికి పైగా ఉపాధ్యాయులను పంపడం వంటి చర్యలతో పాఠశాలల పని తీరును మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేశారు.

ప్రజారోగ్యం విషయంలో కూడా మొహల్లా క్లినిక్‌లతో ఆప్ చేసిన ప్రయోగం పేదసాదలకు ఢిల్లీ కార్పోరేట్ ఆసుపత్రుల ఖర్చుల భారం నుంచి కాపాడింది. ప్రస్తుతం, 300కి పైగా మొహల్లా క్లినిక్‌లు ఉన్నాయి, ఇక్కడ 212 కంటే ఎక్కువ ల్యాబ్ పరీక్షలు, రోగ నిర్ధారణలతో పాటు జెనరిక్ మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాల విద్య, ప్రజారోగ్య రంగాల్లో మెరుగైన నాణ్యమైన ఫలితాలు ఆప్ ప్రభుత్వం సాధించి చూపించింది. పంజాబ్ ఎన్నికల్లో


ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహాలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:

1800 572 3000

ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపు వెనుక ఢిల్లీలో సాధించిన ఈ విజయా లున్నాయి.

ఉత్తరప్రదేశ్ బిజేపీ చెబుతున్న స్వంత 'డబుల్-ఇంజిన్ సర్కార్' ఉంది. ఉత్తరప్రదేశ్ ఆర్థిక స్థితి పేలవంగా ఉంది. రుణ నిష్పత్తిని మెరుగుపరచడంలో విఫలమైంది. విద్య, ప్రజారోగ్యం, ఉద్యోగ కల్పన రంగాలలో రాష్ట్ర సూచికలు అక్కడి ప్రభుత్వ పని తీరును చూపిస్తు న్నాయి.

కోవిడ్ వల్ల ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాలు సామాజిక–ఆర్థిక రంగాల్లో వ్యయం పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయని కొందరు వాదించవచ్చు. పంజాబ్, రాజస్థాన్, కేరళ, పశ్చిమ బెంగాల్, బీహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలు రుణభారం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు. భారతదేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయంలో ఈ 10 రాష్ట్రాల వ్యయం సగం ఉంటుంది. పశ్చిమ బెంగాల్, కేరళ, గోవా, సిక్కిం వంటి రాష్ట్రాలు ప్రాథమిక సామాజిక ఆర్థిక సేవల లభ్యత విషయంలో ఉత్తరప్రదేశ్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, త్రిపుర, పశ్చిమ బెంగాల్, మణిపూర్, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక అవకాశాల లభ్యత విషయంలో మెరుగ్గా ఉన్నాయి. గోవా, సిక్కిం, తమిళనాడు, కేరళ, హిమాచల్ ప్రదేశ్, తెలగాణ, పంజాబ్, మిజోరాం, కర్ణాటక వంటి రాష్ట్రాలు సామాజిక ఆర్థిక అవకాశాలు అందించడంలో మరింత మెరుగ్గా ఉన్నాయి. ఢిల్లీ 0.49 ఇండెక్స్ స్కోర్‌తో 'ఫ్రంట్రన్నర్'గా ర్యాంక్‌ను పొందితే, ఉత్తరప్రదేశ్ 0.28 స్కోరుతో రెండవ–అత్యల్ప స్కోరును కలిగి ఉంది. ఇటీవల ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో బిజెపి ప్రవేశ పెట్టిన అగ్నిపథ్ పథకంపై నిరసనలు పరిశీలిస్తే ఈ రాష్ట్రాల్లో యువతలోని నిరాశ, నిరుద్యోగాల పరిస్థితులు అర్థమవుతాయి.

మోదీ తాయిలాలంటూ ప్రతిపక్షాలపై మండిపడడానికి కారణం లేకపోలేదు. గుజరాత్ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. గుజరాత్‌లో పోటీ పడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఉచిత విద్యుత్ ప్రతి ఇంటికి అందిస్తామని హామీ ఇస్తోంది. దీనిపై బీజేపీ నేత అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ ప్రజా ప్రయోజక వ్యాజ్యం వేశారు. తాయిలా లతో ఓటర్లను ప్రలోభపెడుతున్న రాజకీయ పార్టీలపై క్రిమినల్ కేసులు నమోదయ్యేలా ఉత్తర్వులు కోరుతూ ఆయన పిటీషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, జస్టిస్ కృష్ణమురారీ, జస్టిస్ హిమా కోహ్లీల ధర్మాసనం దీనిపై వ్యాఖ్యానిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఖచ్చితమైన నిర్ణయం తీసుకోకుండా ఎందుకు సంకోచిస్తుందని ప్రశ్నించారు.

తాయిలాలు పంచేవారు ఎక్స్‌ప్రెస్ వేలు, డిఫెన్స్ కారిడార్లు, ఎయిర్ పోర్టులు నిర్మించలేరని మోదీ అన్నారు. ప్రధాని మోదీ ఉచిత పథకా లపై చేసిన విమర్శలపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దీటైన సమాధానమిచ్చారు. ఇంతకూ రేవడీ అనేది పార్లమెంటరీ సభ్యతకు భంగమైన పదమా? అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ముందు అధికార పార్టీ వారు యువతకు ఉద్యోగాలు ఇచ్చి మాట్లాడా లని, అప్పుడు పరనిందల అవసరం వారికి రాదని పేర్కొన్నారు.

ఉచిత నీరు, విద్యుత్తు, ఆరోగ్యం, ప్రాథమిక విద్య అందించడం తాయిలాల కిందకు రాదని, అది ప్రభుత్వ బాధ్యత అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. తాయిలాలు ఇవ్వొద్దంటూ ప్రధాని అన్న మాటలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. 'వేల కోట్లలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని మీ స్నేహితులను క్షమించడాన్ని తాయిలం అంటారు. మీరు విదేశీ టూర్లకు వెళ్లడం, మీ దోస్తుల కోసం కాంట్రా క్టులు ఇప్పించడం తాయిలాలు ఇవ్వడం అంటారు' అని చురకలం టించారు. ఉచిత విద్యుత్తుపై మాట్లాడే వారు ముందు మీ ఎంపీలకు ఎన్ని యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నారో తెలుసుకుని మాట్లాడాలంటూ మండిపడ్డారు.

ఎన్నికల కోసం ఓటర్లకు ఇచ్చే హామీల్లో ఏవి తాయిలాలు? ఏవి సంక్షేమ పథకాలు? ఈ విభజన ఎవరు చేయాలి?

తాయిలాలు అంటే ఏమిటో అనే వివరణే ప్రస్తుతం ఎవరి వద్దా లేదు. ఈ తాయిలాలను అడ్డుకోవడం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వచ్చేది కాదని కమిషన్ అభిప్రాయపడింది. ఇంటింటికి కలర్ టీవీలు, గ్రైండర్లు వగైరా ప్రకటించిన సంఘటనలు ఇంతకు ముందు జరి గాయి. ఇవి ప్రత్యక్షంగా తాయిలాలే కావచ్చు. కాని కూటి కోసం కూలి కోసం రోజూ నానా కష్టాలు పడుతున్న పేదవాళ్ళకు సహాయం చేయడం కూడా తాయిలమే అవుతుందా?

ఒక వృద్ధుడికి వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం తాయిలమా? పేదలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడం తాయిలమా? పేదల ఆర్థిక స్థాయి మెరుగుపరచడానికి చేయూత నివ్వడం తాయిలమా? పేదలకు ఉచిత విద్యుత్తు అందించడం తాయిలమా? సమాజంలో ఆర్థిక సామాజిక సమానత్వం వచ్చే వరకు పేదల పక్షపాతం ప్రభుత్వ విధానాల్లో ఉండాలి.

ప్రస్తుతం దేశజనాభాలో దాదాపు సగం మంది వద్ద దేశసంపదలో కేవలం ఆరుశాతం మాత్రమే ఉంది. దేశసంపదలో 75 శాతం కేవలం పదిశాతం సంపన్నుల చేతుల్లో ఉంది. పేద ధనిక అంతరాలు పెరుగుతూనే ఉన్నాయి. చాలా మంది పేదలకు ఆరోగ్య సదుపా యాలు అందుబాటులో లేవు. వైద్యఖర్చుల వల్ల పేదరికానికి గురవు తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలోచించ వలసింది, సంపన్నులు బాధ్యత తీసుకుని సామాజిక సంక్షేమానికి ముందుకు వచ్చేలా చేయడం. అంతేకాని, దేశ జనాభాలో అత్యధి కంగా ఉన్న పేదలకు అందుతున్న సహాయాలను అడ్డుకోడానికి విమర్శలు చేయడం దేశాభివృద్ధికి మంచిది కాదు. ✤



# గాంధీతో భుజం భుజం కలిపి...

**యండి. ఉస్మాన్ ఖాన్**

**భారతదేశానికి** స్వాతంత్ర్యం సాధించడం కోసం అనేక మంది త్యాగధనులు తమ ధన ప్రాణాలను పణంగా పెట్టారు. అందులో హిందువులూ, ముస్లిములూ భాగస్వాములుగా ఉన్నారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో గాంధీజీతో భుజం భుజం కలిపి నడిచిన సహచరులు అసంఖ్యాకంగా మనకు కనిపిస్తారు. అందులో ముస్లిం సంఖ్య లెక్కకు మిక్కిలి. భారతదేశం స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపుకుంటున్నవేళ, కొంతమంది మహాత్ముని ముస్లిం సహచరులను గురించైనా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

## మార్గదర్శి అబ్దుల్లా హాజీ

గాంధీజీ స్వగ్రామమైన పోరు బందర్‌లో అబ్దుల్లాహ్ హాజీ ఆదం జవేరీ అని ఒక ప్రఖ్యాత ముస్లిం వ్యాపారి ఉండేవారు. మెసర్స్ దాదా అబ్దుల్లా అండ్ కంపెనీ పేరుతో ఆయన దక్షిణాఫ్రికాలో వ్యాపారం నిర్వహించేవారు. దాదా అబ్దుల్లా, గాంధీజీ ఒకే గ్రామవాసులు. అబ్దుల్లా దక్షిణాఫ్రికాలో నిర్వహిస్తున్న వ్యాపారాలకు సంబంధించి అక్కడి న్యాయస్థానాల్లో కొన్ని వ్యాజ్యాలు నడుస్తున్నాయి. తన గ్రామస్తుడైన యువ న్యాయవాదిని పిలిపించుకుంటే బాగుంటుందని భావించిన అబ్దుల్లా దక్షిణాఫ్రికాలో తన కంపెనీ న్యాయ వ్యవహారాలు చూస్తున్న న్యాయవాదులకు సహకరించడానికి గాంధీజీని దక్షిణాఫ్రికా పిలిపించుకున్నారు. అప్పటి నుండి అబ్దుల్లా గాంధీకి అన్ని విషయాల్లో సహకరిస్తూ మార్గదర్శిగా నిలిచారు. ఈ క్రమంలో దాదా అబ్దుల్లా ద్వారా దక్షిణాఫ్రికాలో భారతీయులు ఎదుర్కొంటున్న అనేక విషయాలు తెలుసుకున్నారు గాంధీజీ. స్వయంగా చూశారు. అనుభవించారు కూడా.! ఈ దుర్మార్గపు వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఒక నిర్ణయానికొచ్చిన అబ్దుల్లా, గాంధీజీ ఇద్దరు కలసి, 'నాటల్ ఇండియన్ కాంగ్రెస్' (NIC) అనే ఒక సంస్థను ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షులు దాదా అబ్దుల్లా, కార్యదర్శి గాంధీజీ. హాజీ మహ్మూద్, అబ్దుల్ ఖాదిర్, హాజీ హబీబ్, మూసా హాజీ ఆదం, ముహమ్మద్ పీరాన్, ఖమ్రుద్దీన్, షేక్ ఫరీద్, ఇస్మాయిల్, అబ్దుల్ కరీం, ఉస్మాన్ అహ్మద్ , ముహమ్మద్ తయ్యబ్, హాజీ ఈసా సమద్, ఆదంజీ మియాఖాన్, దావూద్ సేఠ్, ఖాసిం, అబ్దుల్ గని, ఇబ్రాహీం,

గులాం హుసేన్ తదితర ప్రముఖులు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులుగా నియమితులయ్యారు. ఈవిధంగా దాదా అబ్దుల్లా జీవించి ఉన్నంత వరకు గాంధీకి వెన్నుదన్నుగా ఉండి, అనేక విషయాల్లో ఆయనకు మార్గదర్శకులుగా నిలిచారు. దక్షిణాఫ్రికాలో దాదా అబ్దుల్లా సహచర్యంలో 'ప్రజాసేవ చేయాలనే కోరిక, దానికి కావలసిన శక్తి నాకు అక్కడే లభించాయి' అని గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు.

## కుడిభుజంగా నిలిచిన గులాబ్, మోనిస్ అన్సారి

దక్షిణాఫ్రికాలో వివక్షకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన తరువాత గాంధీజీ భారత దేశానికి వచ్చారు. వచ్చీ రాగానే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చంపారన్ రైతాంగ పోరాటాన్ని భుజానికెత్తు కున్నారు. దీనికోసం ఆయన ఎంచుకున్న ఆయుధం దక్షిణాఫ్రికాలో విజయం సాధించి పెట్టిన 'సత్యాగ్రహమే'. చంపారన్ రైతాంగ పోరాట నాయకులు షేక్ గులాబ్, ముహమ్మద్ మోనిస్ అన్సారీ గాంధీజీకి కుడి భుజంగా నిలిచి సహకరించారు.

## పాట్నాలో ఆశ్రయమిచ్చిన మజ్హరుల్ హఖ్

దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష, కుల వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడి విజయుడై స్వదేశానికి విచ్చేసిన గాంధీజీకి ఇక్కడ కూడా వివక్షను ఎదుర్కోక తప్పలేదు. తొలుత పాట్నాలోని బాబూ రాజేంద్రప్రసాద్ (అప్పటికాయన న్యాయవాదే) ఇంట్లోకి ఆయనకు అనుమతి లేకుండా పోయింది. ఆ సమయాన రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో లేని కారణంగా, పని మనుషులు ఆయన్ని ఇంట్లోకి అనుమతించలేదు. బావిలో నీళ్ళు తోడుకొని తాగడానికి గాని, ఇంటి మరుగుదొడ్డి వాడుకోడానికి గాని ఆయనకు అనుమతి ఇవ్వలేదు. ఈ విషయాలను గాంధీజీ తన ఆత్మకథలో రాసుకోవడమే కాకుండా, కొడుకు మదన్ లాల్ గాంధీకి కూడా ఉత్తరం ద్వారా తెలియజేశారు. బాబూజీ ఇంటి పని మనుషులు మమ్మల్ని బిచ్చగాళ్ళకంటే హీనంగా పరిగణించారని రాశారు. అప్పుడాయనకు పాట్నా గ్రామస్తుడైన తన లండన్ సహచరుడు అడ్వకేట్ మౌలానా మజ్హరుల్ హఖ్ గుర్తుకొచ్చారు. బాబూజీ ఇంట తనకెదురైన పరిస్థితిని వివరిస్తూ ఆయనకు కబురు పెట్టారు. వెంటనే మజ్హరుల్ హఖ్ ఆగమేఘాల మీద గాంధీజీ దగ్గరికొచ్చి, ఆయనకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సంఘటనను గాంధీజీ తన ఆత్మకథలో 'చంపారన్ మచ్చ' పేరుతో రాసుకున్నారు.



## 'బాపూజీ' ప్రాణాలు కాపాడిన 'బతఖ్ మియా'

తరువాత ఆయన చంపారన్ చేరుకొని అక్కడి రైతుల గోసను విన్నారు. నీలిమందు సాగు చేయాలని ఆంగ్ల పాలకులు తమపై జరుపుతున్న దాడులు, దుర్మార్గాలను రైతులు గాంధీజీకి ఏకరువు పెట్టారు. చంపారన్ రైతుల్లో గాంధీజీకి ఉన్న ఆదరణ, తదనంతర పరిణామాలనూ పసిగట్టిన ఆంగ్ల అధికారి ఇర్విన్ గాంధీ అడ్డుతొలగించుకోవాలని పథకం పన్నాడు. దీనికిగాను తన ఇంట్లో వంట మనిషిగా పని చేస్తున్న బతఖ్ మియా అన్సారీని ఎంచుకున్నాడు. పథకంలో భాగంగా గాంధీని భోజనానికి ఆహ్వానించి, ఆయనకు విషమిచ్చి చంపే బాధ్యతను అన్సారీకి అప్పగించాడు. గాంధీజీని చంపితే ఊహకు కూడా అందని బహుమతులతో సత్కరిస్తానని, పథకం విఫలమైతే నరకం చూపించి అనంత లోకాలకు పంపుతానని భయపెట్టాడు. కాని బతఖ్ మియా తన ప్రాణాలకు తెగించి బాపూజీ ప్రాణాలు రక్షించారు. ఈ విధంగా ఆంగ్లేయుల కుట్రల నుండి బాపూజీ ప్రాణాలు కాపాడి భారత స్వాతంత్రోద్యమానికి నాయకత్వాన్ని అందించారు బతఖ్ మియా అన్సారీ. అన్సారీ సాబ్ నీకు వేనవేల సలాములు. ఆనాడు నువ్వు, నిన్ను, నీ కుటుంబాన్ని త్యాగం చేసి ఉండకపోతే గాంధీజీ లాంటి నాయకుడు ఏమైపోయి ఉండేవాడో, భారత స్వాతంత్రోద్యమ చరిత్ర ఎలాంటి మలుపులు తిరిగేదో ఊహిస్తేనే భయమేస్తోంది.

## కొండంత అండ అలీ బ్రదర్స్

చంపారన్ రైతాంగ పోరాటంలో విజయం సాధించిన గాంధీజీ భారత జాతీయ ఉద్యమంలోకి దూకారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో 'అలీ బ్రదర్స్'గా ప్రసిద్ధి గాంచిన మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్, మౌలానా షౌకత్ అలీ జౌహర్ , వారి కుటుంబం యొక్క అండదండలు గాంధీజీకి కొండంత బలాన్నిచ్చాయి. అలీసోదరులతో గాంధీజీ ఎంతగా కలిసిపొయ్యారంటే, ఆబాదీ బాను బేగంకు తాను మూడవ సంతానమని చెప్పుకునే వారు. అలీ సోదరుల తల్లి ఆబాదీ బాను బేగంను గాంధీజీ అమ్మా అనే పిలిచేవారు. అందుకే ఆమె ప్రజలందరి చేతా అమ్మగా పిలువబడి 'బీబీ అమ్మాన్'గా ప్రసిద్ధి చెందారు. స్వాతంత్రోద్యమం కోసం గాంధీజీకి ఆమె భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందించేవారు. 1924లో ఆమె అంతిమ సమయాన అలీ సోదరులతో పాటు తను కూడా 'అమ్మ' మంచం దగ్గరే ఉన్నారు. అమ్మ అంతిమ శ్వాస విడిచే సమయాన ఆమె పక్కనే ఉండడం తన అదృష్టమని గాంధీజీ రాసుకున్నారు.

## ఆపద్బాంధవుడు ఉమర్ సుభానీ

గాంధీజీకి ఉద్యమ అవసరాల కోసం ఆపద్బాంధవుడిలా ఆదుకున్న మరో సహచరుడు ఉమర్ సుభానీ. బొంబాయిలో ఏ మీటింగు జరిగినా, ఎంత పెద్ద కార్యక్రమం జరిగినా అందులో సగానికి సగం ఉమర్ సుభానీ ఒక్కడే భరించేవారు. ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అలుపెరుగని ప్రయత్నం చేసేవారు. 1921 లో 'తిలక్ స్వరాజ్య నిధి'కి విరాళాలు సేకరించే సమయాన గాంధీజీకి బ్లాంక్ చెక్కు ఇచ్చి 'ఎంత అవసరమో అంత రాసుకోండి' అన్న ఉదార గుణ సంపన్నుడు ఉమర్ సుభానీ.

## ప్రాణ స్నేహితుడు ఖాదిర్ బావజీర్

గాంధీజీ మరో ప్రాణ స్నేహితుడు, దక్షిణాఫ్రికా నుండి కుటుంబంతో సహా గాంధీజీ వెంట భారత దేశానికి వచ్చేసిన మిత్రుడు ఇమాం అబ్దుల్ ఖాదిర్ బావజీర్. దక్షిణాఫ్రికాలో అత్యంత సంపన్న, విలాస జీవితాన్ని త్యాగంచేసి, గాంధీజీ సహచర్యంతో భారతదేశానికి తరలివచ్చి, సబర్మతీ ఆశ్రమంలో సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడిన త్యాగధనుడు. అంతటి గొప్ప సంపన్న, విలాస జీవితం గడిపిన ఇమాం అబ్దుల్ ఖాదిర్ ఆశ్రమంలో గ్రంథాలయ బాధ్యతలను చేపట్టారు. గాంధీజీ ఆయన్ని ప్రేమగా 'ఇమాంసాబ్' అని పిలుచుకునేవారు. ఆయన సతీమణి, ఇద్దరు కుమార్తెలు కూడా ఆశ్రమంలోని ప్రెస్‌లోనే పనిచేసేవారు. గాంధీజీ ఇమాం సాహెబ్‌ను తన సోదరునిగా పరిగణించేవారు. అబ్దుల్ ఖాదిర్ కూతురు ఫాతిమా బేగం వివాహం ఆయన స్వయంగా దగ్గరుండి జరిపించారు. 1920 ఏప్రిల్ 2వ తేదీన జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించి గాంధీజీ పేరున ప్రచురితమైన ఆహ్వాన పత్రిక /శుభలేఖ భారత జాతీయోద్యమ సాహిత్య చరిత్రలో కలికితురాయిగా నిలిచిపోయింది. తను పెళ్ళిపెద్దగా వ్యవహరించి జరిపిన ఈ వివాహ విశేషాలను స్వయంగా గాంధీజీ తన 'నవ జీవన్' పత్రికలో విశేషంగా ప్రచురించారు.

అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గాంధీజీ మరో సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సరిహద్దు గాంధీ. 'ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసను ఆయుధంగా ధరించిన ఈ పఠాన్ చాలా ప్రమాదకారి' అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న ధీరోదాత్తుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణగదొక్కిన వారిని, హింసించిన వారిని కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతో 'ఖుదాయి ఖిద్మత్ గార్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు ఈ సరిహద్దు గాంధీ. 1969లో గాంధీజీ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ, 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కనుక గాంధీతో పాటు, సరిహద్దు గాంధీని కూడా గుర్తుంచుకోవలసిన కర్తవ్యం మనపై ఉంది.

## భుజం భుజం కలిపి నడిచిన ఆజాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ – ఈయన మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితుడు. ఆంగ్ల ముష్కరులకు వ్యతిరేకంగా విప్లవ శంఖం పూరించిన వీరయోధుడు. జాతి గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. 1920లో తొలిసారిగి గాంధీజీని కలుసుకున్నది మొదలు చివరి వరకు ఆయనతో భుజంభుజం కలిపి నడిచారు. అహింసా మార్గాన ఖిలాఫత్–సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. దేశ విభజనను నిర్ద్వందంగా వ్యతిరేకించారు. పదేళ్ళకు పైగా జైలు జీవితం గడిపారు. భారత దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు.

ఈ విధంగా అసంఖ్యాక మంది ముస్లింలు గాంధీజీకి సన్నిహితంగా, స్నేహంగా, ఉద్యమ భాగస్వాములుగా వెలుగొందారు. స్థలాభావం వల్ల వారందరి పేర్లు ప్రస్తావించడం కుదరని పని. కాని నేటి మన దేశ పరిస్థితుల దృష్ట్యా సంక్షిప్తంగానైనా దేశ స్వాతంత్రోద్యమంలో ముస్లింల భాగస్వామ్యానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు పరిచయం చేయడం, ముఖ్యంగా యువతరానికి తెలియజేయడం మనందరి నైతిక కర్తవ్యం. ✤

'చరితార్థులు'



# ముహమ్మద్ రజబ్ అలీ

137

## (1920-1996)

**జాతీయోద్యమంలో** పాల్గొనడం మాత్రమే కాకుండా నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ సాగిన విలీనోద్యమం, ఆ తరువాత స్వతంత్ర భారతంలో ప్రజాపక్షంగా సాగిన పోరాటాలలో అవిశ్రాంతంగా పాల్గొన్న ముహమ్మద్ రజబ్ అలీ ఆంధ్ర ప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా పాపటపల్లి గ్రామంలో 1920 జనవరి ఒకటిన జన్మించారు. ఆయన తల్లి ఆమీనాబీ, మహబూబ్ అలీ. స్వగ్రామంలో ప్రాథమిక విద్యానంతరం, ఉన్నత పాఠశాలలో తొమ్మిది వరకు చదివి, ఉట్కూరు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఆ ఉద్యోగాన్ని వదలి తెలుగు-ఉర్దూ అనువాదకునిగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో కొంతకాలం పని చేశారు. ఆ ఉద్యోగం వదలి తిరిగి స్వగ్రామం వచ్చి ఆయన గ్రామ కరణంగా బాధ్యతలు చేపట్టారు. చిన్న వయస్సు నుండి స్వతంత్ర భావాలు గల రజబ్ అలీ 1944లో ఆంధ్ర మహాసభలో పూర్తిస్థాయి సభ్యత్వం స్వీకరించారు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు ఆంధ్రమహాసభ నిర్వహించిన 'భూమి-భుక్తి' లాంటి పోరాటాలలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. అందుకు ఆగ్రహించిన ప్రభుత్వం ఆయనను 'డిటెన్యూ'గా ప్రకటించి మూడున్నర ఏండ్లపాటు నిర్బంధంలో ఉంచింది. ఆ తరువాత కూడా ఉద్యమ కార్యకలాపాలను కొనసాగించడంతో 1946లో నైజాం సైన్యాలు ఆయనను వరంగల్ జైలులో మూడు మాసాల పాటు నిర్బంధంలో ఉంచాయి. స్వాతంత్ర్యానంతరం 1947లో ఆరంభమైన నైజాం విలీనం పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆ తరువాతి క్రమంలో కమ్యూనిస్టులతో ఏర్పడిన సాన్నిహిత్యం, సామ్యవాద భావనల పట్ల కలిగిన ఆసక్తి ఫలితంగా 1947లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆ కారణంగా 36 నెలల పాటు జైలుజీవితం గడిపారు. ఆ తరువాత ఆరంభమైన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో క్రియాశీలక పాత్ర నిర్వహించిన ఆయనను యూనియన్ సైన్యం అరెస్టు చేసింది. ఆయనతోపాటు అరెస్టయిన వారినందరిని కాల్చి చంపిన సైన్యం రజబ్ అలీని మాత్రం జైలుకు పంపడంతో ఆయన బ్రతికి బయట పడ్డారు. భారతదేశంలో రైతాంగం పక్షాన, శ్రమజీవుల పక్షాన నిలిచిన ముహమ్మద్ రజబ్ అలీ నందికొండ ప్రాజెక్టు సాధన కోసం జరిగిన యాత్రలో పాల్గొన్నారు. 1964లో చైనా యుద్ధం సందర్భంగా 18 మాసాల పాటు నిర్బంధానికి గురయ్యారు. ప్రజాపక్షపాతిగా పేరు సంపాదించుకున్న ఆయన 1967లో సిపిఎం పార్టీ టిక్కెట్టు మీద ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా శాసనసభకు తొలిసారిగా ఎన్నియ్యారు. 1971లో చారిత్రాత్మక 'ఆకలియాత్ర'ను రజబ్ అలీ స్వయంగా ఖమ్మం జిల్లాలో నిర్వహించారు. ఆ తరువాత ముహమ్మద్ రజబ్ అలీ 1978 నాటి ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఆ తరువాత 1983, 1985, 1989, 1994లలో జరిగిన ఎన్నికలలో సుజాతనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ప్రజల హితైషిగా సామాన్య ప్రజల అంతులేని అభిమానాన్ని తన సొంతం చేసుకున్న ముహమ్మద్ రజబ్ అలీ 1996 మార్చి ఒకటిన కన్నుమూశారు. ✤



✆ 9440241727

బ్రిటీష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ, కదిరి**



# అపార్థాల మబ్బుల్లో ముస్లిములు

**మేము** ఈ దేశ మూలవాసులం... మేము ఈ దేశంలోనే పుట్టాము... కనుక మేము పుట్టుకతో భారతీయులం...విశ్వాస పరంగా అయితే మేము ముస్లింలము... సృష్టికర్త అయిన అల్లాహ్‌ను ఆరాధ్య దైవంగా విశ్వసిస్తాము... ఆయనకు విధేయత చూపుతాము... దివ్యఖుర్‌ఆన్‌ను అంతిమ దైవగ్రంథంగా నమ్ము తాము...అంతిమ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అమితంగా ప్రేమిస్తాము... ఆయన్ను ఆదర్శమూర్తిగా నమ్మి అనుసరిస్తాము... దేశంలో ఇన్నాళ్ళు మా ఉనికి వల్ల–ఏనాడు మా విశ్వాసాలు, మా సాంప్రదాయాలు, మా ఆహారపు అలవాట్లు, మా భాష, మా వస్త్రధారణ, మా మస్జిదులు, ఆ మస్జిదుల్లో ఇచ్చే అజాన్, మా పండుగలు, మా జీవన విధానం, మా పెళ్లి వ్యవహారం, మా మదరసాలు, మా ఖుర్‌ఆన్ బోధనలు – ఇలా ఏదీ ఎవరికీ ఇబ్బంది కలిగించ లేదు... మా చుట్టుప్రక్కల ఉన్న తోటి సోదర సోదరీమణులు కూడా అభ్యంతరము చెప్పలేదు... దేశంలో అందరూ కలసి మెలిసి ఉంటున్నాం... మన మధ్యన ప్రేమానురాగాలు ఆప్యాయతాను బంధాలు ఉన్నాయి... బావా ఎలా ఉన్నావు? మామా ఎలా ఉన్నావు? అన్నా ఎలా ఉన్నావు? అత్తా ఎలా ఉన్నావు? పెద్దమ్మా ఎలా ఉన్నావు? చెల్లెమ్మా ఎలా ఉన్నావు? ఇలాంటి ఆత్మీయ పలకరింపులు వినబడతాయి...! చిరునవ్వులు

చిందించే ముఖాలు దర్శనమిస్తాయి...! సుఖదుఃఖాలలో పరస్పర శుభాకాంక్షలు ఉంటాయి...! ఓదార్పులు ఉంటాయి...!

కానీ కొన్ని సంవత్సరాల నుండి కొందరు – సంకుచిత మనస్కులు, మానసిక రోగులు, అధికారం అంతస్తుల కోసం పాకులాడే మానహీనులు దేశభక్తి ముసుగులో దేశ ప్రజల హృదయాల్లో కుల మత వర్గ వర్ణ భాషా ప్రాంతీయ దురభిమానాల విషబీజాలు నాటుతున్నారు... ప్రజల మధ్యన సామాజిక దూరాలు పెంచుతున్నారు... ఒక వర్గాన్ని మరొక వర్గానికి, ఒక మతం వారిని మరొక మతం వారికి, ఒక ప్రాంతం వారిని మరొక ప్రాంతం వారికి – పొంచి ఉన్న ప్రమాదంగా విషపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారు... ప్రత్యేకంగా భిన్నత్వంలో ఏకత్వానికి ఆదర్శమైన మన దేశంలో **BJP** ప్రభుత్వంలో ముస్లిములకు వ్యతిరేకంగా అన్ని కోణాల నుండి, అన్ని మార్గాల నుండి విద్వేష దాడులు జరుగుతున్నాయి... ముస్లిములు దేశ ద్రోహులని, తీవ్రవాదులని, ఉగ్రవాదులని ముస్లిముల వల్ల శాంతి భద్రతలకు ప్రమాదం పొంచి ఉందని రేయి పగలు ప్రింట్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో కుట్ర పూరితమైన వ్యాఖ్యలు చేస్తున్నారు... కల్పిత కథలు అల్లుతున్నారు... సినిమాలు తీస్తున్నారు, చూపిస్తున్నారు...

ప్రభుత్వ పాలకులు, ప్రభుత్వ అధికారులు తమ అసమర్థ పాలన నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి పెట్టుబడిదారుల ఆర్థిక సహాయంతో– ఇస్లాం ధర్మబోధనలపై, ఇస్లాం ప్రవక్త మహనీయ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తిత్వంపై బురదజల్లుతున్నారు... దివ్య ఖుర్‌ఆన్‌లోని శాంతి సందేశాన్ని వక్రీకరిస్తున్నారు... ముస్లింల ఆరాధనా విధానంపై, ముస్లింల వస్త్రధారణపై, ముస్లిముల అన్న పానీయాలపై ఆంక్షలు విధిస్తున్నారు... మత కలహాలు సృష్టిస్తున్నారు... ముస్లిముల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు... స్వార్థపరులు, అవకాశవాదులు ముస్లింలకు వ్యతిరేకంగా చేస్తున్న దుష్ప్రచారానికి కొంత మంది అమాయక ప్రజలు ప్రభావితులై ముస్లింలను అపరిచితులుగా, విదేశీయులుగా, దేశ ద్రోహులుగా, ఉగ్రవాదులుగా భావిస్తున్నారు... ఇది మా అనుభవం...! మానవతా దృక్పథంతో సామాజిక సేవలో మాకు ఎదురైన అనుభవాలు ఎన్నో ఉన్నాయి...!

వాస్తవం ఏమిటంటే – స్వాతంత్ర్యానికి పూర్వంగాని లేదా స్వాతంత్ర్యం అనంతరం 75 సంవత్సరాల వరకు నేటి – వరకు ముస్లింలు దేశానికి ఏ ప్రమాదం తెచ్చిపెట్టలేదు.... పైగా ముస్లిములు, మస్జిదుల ఇమాములు, ఉలమాలు, ధార్మిక సంస్థలు జాతీయ సమైక్యతను బలపరిచారు... దేశ సమగ్రతను కాపాడారు... దేశ అభివృద్ధిని కాంక్షించారు... శాంతి భద్రతలకు ఎలాంటి ముప్పు రాకుండా ముస్లిం సముదాయానికి సహనం ఓర్పు సంయమనం పాటించాలని హితబోధన చేశారు... ఎవరు నమ్మినా నమ్మకపోయినా ఇది వాస్తవం...!

దేశ పాలకులు దేశభక్తి ముసుగులో దేశ వనరులను , జాతీయ సంపదను యథేచ్ఛగా అమ్ముతున్న విషయం ప్రజలకు తెలుసు..! ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి జైళ్ల పాలు చేయడమూ తెలుసు...! అంబానీ, అదానీ ఇంకా తదితర బడా పారిశ్రామిక వేత్తలు దేశాన్ని ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారు అని కూడా తెలుసు...! ప్రజలు పాలకులను అధికారులను ప్రశ్నించకూడదని, ఇస్లాం ధర్మం పట్ల, ముస్లిముల పట్ల అపార్థాలు సృష్టించి, ప్రజలు దేశ సమస్యల గురించి ఆలోచించకుండా, వారికి మతం మత్తులో ముంచి పబ్బం గడువుకుంటున్నారు దేశ పాలకులు, ప్రభుత్వ అధికారులు... ఏది ఏమైనా ముస్లిం సమాజంపై క్రమ్ముకున్న అపార్థాల మబ్బులు తొలిగిపోయి అతి త్వరలో ప్రజల జీవితాలలో జ్ఞానోదయం కలుగుతుందని, నిజమైన దేశప్రేమికులు ఎవరో దేశ ద్రోహులు ఎవరో పౌరులు తెలుసుకుంటారని, మానవీయ విలువల ఆధారంగా, నైతిక ప్రమాణాల మూలంగా దేశంలో శాంతి స్థాపన జరుగుతుందని ఆశిద్దాం. ✤

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతహు !
సోదర సోదరీమణులకు మా ఆత్మీయ ఆహ్వానం
హజ్–ఉమ్రా యాత్రలకు మా ద్వారా ప్రయాణించండి.
AL-FURQAN VIJAYAWADA HAJ-UMRAH SERVICE
ఆల్ ఫుర్‌ఖాన్
హజ్ ఉమ్రా సర్వీస్
ఫారూఖ్ నగర్ మసీదు దగ్గర బందరు రోడ్డు, విజయవాడ - 7
9666197766, 9494115561




# నైతిక సంక్షోభంలో దైవాదేశాలే దిక్సూచి

**మనిషి సాంకేతికంగా** ఎంత ఎత్తు ఎదిగినా నైతికంగా చాలా దిగజారి పోయాడని, దీనికి కారణం దైవాదేశాలు ధిక్కరించడమే అని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు సల్మాన్ అహ్మద్ అన్నారు. ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో "క్రాంతితో నడవండి" అనే అంశంపై జరిగిన ఎస్.ఐ.ఒ. జిల్లా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మనిషి దేవు డిచ్చిన కాంతి ఉపయోగించుకొని ఆకాశంలో, సముద్రంలో ఉన్న విషయాలను తెలుసుకోగలిగాడు. కానీ అదే మనిషి ఒక ఉత్తమమైన మనిషి లాగా బ్రతకడం మాత్రం నేర్చుకోలేదన్నారు. మనిషి ఎల్లప్పుడూ కాంతితో నడవాలి, ఆ కాంతి దైవ బోధనలలో మహనీయుల జీవితాలలో నుండి గ్రహించవలసి ఉంటుందన్నారు. మనిషి తన జీవిత లక్ష్యాలను తెలుసుకోవడంతో పాటు సాటి మానవు లతో ప్రేమ ఆప్యాయ తలతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. మనిషి ఎల్లప్పుడూ దైవానికి భయపడుతూ పరలోక భీతితో జీవితం గడిపినప్పుడే ఇహపర లోకాలలో సాఫల్యం పొందుతాడు అన్నారు. మనిషిని పుట్టించిన సృష్టికర్తను పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తల్హా ఫైజుద్దీన్ మాట్లాడుతూ యువతరం నిర్లిప్తత వీడి బాధ్యతగా మసలుకుంటే అద్భుతాలు చేయొచ్చని, దాంతో సమాజం రూపు రేఖలే మారిపోతాయని అన్నారు. నేటి యువతరం ఎక్కువగా చెడుకు ఆకర్షితులై మంచికి కనెక్ట్ కాలేకపోతున్నారని, తమ సమయాన్ని, శక్తియుక్తుల్ని వృధా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యవ్వనంలో ఉన్నప్పుడే లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించుకోవాలని, సమాజహితం కోసం పని చేయాలని అన్నారు.

కార్యక్రమంలో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి ఖాయముద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వసిఉల్లాహ్, జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సాదిక్ అహ్మద్, జమాఅతె ఇస్లామీ హింద్ లీగల్ అఫైర్స్ కార్యదర్శి ముహమ్మద్ ఇల్యాస్, అర్బన్ జిల్లా అధ్యక్షులు అబ్రార్ అలీ, రూరల్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్. ఖిల్లా డివిజన్ అధ్యక్షులు ఖలీల్ అహ్మద్ ఖాన్, ఇందిరా నగర్ డివిజన్ అధ్యక్షులు జమీల్ అహ్మద్ ఖాన్, ఇస్లాంపేట డివిజన్ అధ్యక్షులు అబ్దుస్ సుబూర్, ఎస్.ఐ.ఓ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అతీఖ్ అహ్మద్‌ఖాన్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ముబీన్, ఖమ్మం పట్టణ అధ్యక్షులు కాన్ఫరెన్స్ కన్వీనర్ తౌసిఫ్ అహ్మద్ ఖాన్, సభ్యులు అబ్దుల్ అజీజ్, షేక్ మతీన్, ఆమెర్ ఒసామా, అలీమ్ అబ్దుల్లా జావేద్, హంజా, ఫైజాన్, అబిద్ ముజమ్మిల్, అనస్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు మంజర్ అహ్మద్, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు ఎస్.కే. ఖాసిమ్, సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ అష్రఫ్, అబ్దుల్ మలిక్, అబ్దుల్ రాఫె, షేక్ ఇలియాస్, నిహాల్ అహ్మద్, మొహినుద్దీన్, అబ్దుల్ రజాక్, జైనుల్ పాషా, అబ్దుల్ అజీజ్, గౌస్, నాసర్, హకీమ్, ఖమ్మం, కొత్తగూడెం రెండు జిల్లాల వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, స్త్రీలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

★★★




# ఉద్యమాలతోనే గిరిజన హక్కుల పరిరక్షణ

**(ఆగస్టు9 న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా..)**

**- మదీహా అర్జుమంద్**

**భారతదేశం విభిన్నకులాలు, మతాలు, జాతులు, తెగల సమాహారం. అందులో ఆదివాసీ గిరిజన సముదాయం కూడా ఒకటి. భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదాయాలు నివసిస్తున్నాయి. ఆదివాసీ గిరిజనులు తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలను కలిగి ఉన్నారు. ఒరిస్సా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘఢ్ , రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ ,పశ్చిమ బెంగాల్, మిజోరం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వీరి ముఖ్యమైన నివాస ప్రాంతాలు. అండమాన్ నికోబార్ దీవుల్లో కూడా వీరి నివాసాలున్నాయి.**

తెలంగాణాలోని భద్రాద్రి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో చిన్నచిన్న గూడేలు ఎక్కువ. ఒక్కో పంచాయితీ పరిధిలో అనేక గూడేలు ఉంటాయి. ఆదివాసులు అంటే, అడవిలో ఉండేవాళ్లు. ఆహారం కోసం ఆకులు, అలముల సేకరణ, వేట దశల నుండి ప్రస్తుతం 'పోడు' వ్యవసాయం లోకి ప్రవేశించారు. వీరు గోండు, నాయకపోడు, గొత్తికోయ, కోలాము, కొండరెడ్డి, చెంచు, సవర తదితర జాతుల తెగలు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న చెంచు జాతులయితే ఇంకా పాత వ్యవసాయోత్పత్తి విధానంలోనే కొనసాగుతున్నారు. గోండు, కోయ తదితర తెగలు గోదావరి తీరంలో నల్లరేగడి నేలల్లో పత్తి, పొగాకు, మిర్చి లాంటి వాణిజ్య పంటలు పండించడం నేర్చుకున్నారంటే అది పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణలోని ' సెటిలర్స్' ప్రభావం వల్లనే. నిజానికి పోడు వ్యవసాయమే ఈ అడవి బిడ్డల ప్రధాన జీవనాధారం.

## ప్రధాన తెగలు

భారతదేశంలో ప్రధానంగా మనకు మూడు రకాల గిరిజన తెగలు కనిపిస్తాయి.

**ఒకటి:** దట్టమైన అటవీ ప్రాంతాల్లో, కొండలు కోనల్లో జనజీవన స్రవంతికి దూరంగా నివసించేవారు. వీరు అడవులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తారు. స్వతంత్ర జీవులైనప్పటికీ ఆర్థికంగా బాగా వెనకబడిన తెగలివి.

**రెండు:** అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నా, వ్యవసాయం ప్రధానంగా చేసే ఆదిమ తెగలు. వీరికి పాక్షికంగా గిరిజనేతరులతో సంబంధాలుంటాయి. సామాజిక, వ్యాపార లావాదేవీలు ఉండే అవకాశముంది.

మూడు: మైదాన ప్రాంతాల్లోని గిరిజన సమూహాలు. జనజీవన స్రవంతిలో భాగంగా ఉండి ఆధునిక జీవన విధానానికి దగ్గరగా ఉంటారు. ప్రభుత్వం కల్పించే చాలా అభివృద్ధి పథకాలు ఈ మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దగ్గరగా ఉన్న తెగలు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాయి. అందుకే వీరిలో విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అభివృద్ధి కనిపిస్తుంది. ఉదాహరణకు ఉత్తర భారతదేశంలో భిల్లులు, మధ్యప్రదేశ్‌లో సంతాల్‌లు, బీహార్‌లో ముండాలు, మహారాష్ట్ర, తెలంగాణల్లో రాజ్ గోండులు, లంబాడీలు జనజీవన స్రవంతికి చాలా దగ్గరగా ఉండే సమూహాలు. అందుకని వీరిలో రాజకీయ, ఆర్థిక, విద్యా పరమైన అభివృద్ధి కనిపిస్తుంది. అదే చెంచు లాంటి తెగలను గమనిస్తే వారింకా జనజీవన స్రవంతికి దూరంగానే ఉండి పొయ్యారు.

సామాజిక, మానవ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం , ప్రపంచ వ్యాప్తంగా 70 దేశాల్లో 5 వేలకు పైగా గిరిజన తెగలున్నాయి. 38 కోట్లమంది ఆదివాసీ గిరిజన ప్రజలు మనుగడ సాగిస్తున్నారు. ఒక్క భారతదేశంలోనే పదికోట్ల నలభై లక్షల మంది, 500 కు పైగా తెగలుగా విస్తరించి ఉన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో వీరి జనాభా ఎక్కువ. ఆయా రాష్ట్రాల మొత్తం జనాభాలో 80 నుంచి 90 శాతం గిరిజనులే. వీరిలో జనాభా పరంగా చూస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణల్లో విస్తరించిన గోండు తెగ అత్యధిక జనాభాతో ఉంది. ఈ గోండుల్లో కూడా రకరకాల వారున్నారు. ఉదాహరణకు

**ఆంధ్రప్రదేశ్‌లో** – కోయ, కొండదొర, సవర, కొండరెడ్డి..

**తెలంగాణలో** – రాజ్‌గోండులు, లంబాడీలు, చెంచులు, ఎరుకలు, గుత్తికోయ, కోలమ్, నాయక పోడు..

**తమిళనాడులో** – ఇరుల, తోడా, కురుంబా, కడార్‌లు..

**కర్ణాటకలో** – నాయికాడ, మరాటీలు..

**కేరళలో** – కుళయన్, పనియన్..

**అండమాన్, నికోబార్ దీవుల్లో** – అండమానీలు, జారవాలు, నికోబారీలు ప్రధాన తెగలు. రకరకాల కారణాల వల్ల జారవా అనే తెగతో పాటు అండమానీలు జనాభా పరంగా దాదాపు అంతరించే స్థితిలో ఉన్న తెగలు.

మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఎక్కువగా కనిపించేవారు మరియా గోండులు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా పరిధిలో కనిపించే వారు రాజ్‌గోండులు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో ప్రధానమైన తెగ భిల్లులు. బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లలో సంతాల్‌లు. ఝార్ఖండ్‌లో ముండాలు అత్యధిక సంఖ్యలో ఉన్న గిరిజన సమూహం. మహారాష్ట్ర, గుజరాత్‌లలో కూడా గిరిజన జనాభా ఎక్కువగా ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం అక్కడి జనాభాలో అత్యధిక శాతం గిరిజన తెగకు చెందినవారే. ఉదాహరణకు మిజోరాం జనాభాలో 95 శాతం గిరిజన తెగలే. అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయల్లోని జనాభాలో 80 శాతం గిరిజనులు. నాగాలాండ్‌లో 85 శాతం పైగా, మధ్యప్రదేశ్, ఒడిశాల్లో 25 శాతం వరకు గిరిజన జనాభా ఉంది. గుజరాత్‌లో 14 శాతం, రాజస్థాన్‌లో 12 శాతం, అసోం, బీహార్‌ల్లో 10 శాతం, తెలంగాణాలో 9. 8 శాతం గిరిజన జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## భాష మాట్లాడడం నామోషీ కాదు

'కోయ' అనేది ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో నివసించే ఒక తెగ. వీరు ఇంద్రావతి, గోదావరి, శబరి, సీలేరు నదుల పరీవాహక ప్రాంతాల్లోను, బస్తర్, కొరాపుట్, భద్రాచలం, ఖమ్మం, వరంగల్ , కరీంనగర్, ఉభయ గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవులైన తూర్పు కనుమలలోను కనిపిస్తారు. భారతీయ కుల వర్గీకరణ ప్రకారం వీరు షెడ్యూల్ ట్రైబ్ (Schedule Tribe) గ్రూపుకి చెందినవారు. 1991 జనాభా లెక్కల ప్రకారం వీరి సంఖ్య 1,40,000. వీరిలో ఐకమత్యం ఎక్కువ. నాయకుడి ఆదేశం తు. చ. తప్పక పాటిస్తారు. దేశభక్తి కూడా ఎక్కువే. 1880 లో వీరు బ్రిటీషు పాలనపై తిరుగుబాటు చేశారు. దీన్ని 'కోయ' తిరుగుబాటు అంటారు. వీరు మాట్లాడే కోయ భాష తెలుగు భాషకు దగ్గరగా ఉంటుంది. కోయ భాషకు లిపి లేదు. దానికోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణకు చెందిన చరిత్ర పరిశోధకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు గిరిజన సంస్కృతిపై విశేష కృషి చేస్తున్నారు. ఇటీవలి కాలంలో కొంతమంది గిరిజన సోదరులు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నవారు మాతృ భాష పట్ల విముఖత చూపుతున్నారు. 'కోయ' భాష మాట్లాడడం వారికి నామోషీగా అనిపిస్తోంది. 'మా పిల్లలకు భాష రాదు' అని గర్వంగా చెప్పుకుంటారు. ఇది చాలా విచారకరం. ఏ జాతికైనా దాని భాషే

జీవనాడి. భాష చచ్చిపోతే జాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది. కనుక మాతృభాషను నిర్లక్ష్యం చేసేవారిని చరిత్ర క్షమించదని గుర్తుంచుకోవాలి.

కోయల్లో రాచకోయ, లింగదారి కోయ, కమ్మర కోయ అరిటి కోయ అనే ఉప కులాలున్నాయి. ఈ ఉపకులాల్లోని ఆహారపు అలవాట్లన్నీ ఒకేలా ఉండవు. ఒక్క లింగదారి కోయలు తప్ప, మిగతా వారంతా గొడ్డు మాంసం (Beef) తింటారు. రాచ కోయలు గ్రామ పెద్దలుగా ఉంటారు. పండుగ సమయాల్లో వీరు కొన్ని రకాల పూజలు చేస్తారు. భూమి పండుగ, కొత్తల పండుగ లాంటివి ఆచరిస్తారు. ప్రకృతే వీరి ఆరాధ్య దైవం. కమ్మర కోయలు వ్యవసాయ పనిముట్లను తయారు చేస్తారు. అరిటి కోయలు పాటలు పాడుతారు, వంశ వృక్షాలను వివరిస్తారు.

## సామాజిక స్పృహ ఎక్కువే

జీవిత భాగస్వామిని చర్చల ద్వారా ఎన్నుకొంటారు. ఒక్కోసారి అమ్మాయి అబ్బాయి ఇద్దరూ కలిసి లేచిపోతారు. కొన్నాళ్ళ తరువాత ఇరువర్గాల పెద్దలు చర్చలు జరిపి అబ్బాయితో కొంత మొత్తాన్ని తప్పుగా కట్టిస్తారు. జీవాన్ని వధిస్తారు. కల్లు, సారాయి సేవిస్తారు. ఇప్పసారా వీరికి మహా ప్రీతి. వివాహ వేడుకను రెండు గ్రామాల ప్రజలు కలిసి మూడు రోజుల పాటు జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ కొంత ధాన్యం , కొంత మద్యం పెళ్ళికూతురి ఇంటికి తీసుకువెళతారు. పెళ్ళి కూతురు తండ్రికి ఆర్థిక వెసులుబాటుగా ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. అమ్మాయి తండ్రిని ఆర్థిక ఇబ్బందుల్లో పడేయకూడదన్నవారి సామాజిక స్పృహకు ఇది నిదర్శనం. తాటి కల్లు ఎక్కువగా దొరికే వేసవి కాలంలో వివాహాలు జరుగుతాయి. సహజంగానే వీరు చాలా నమ్మకస్తులు. మంచి స్నేహితులు. నమ్మితే ప్రాణమైనా ఇస్తారు. తేడా వస్తే ప్రాణం తియ్యడానికీ వెనుకాడరు. ఇటీవలి కాలంలో వీరిలో కుడా కొందరు నకిలీలు, స్వార్ధపరులు పుట్టుకొచ్చారు.

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటిపోయినా ఆదివాసీ గిరిజనులకు ఇంకా సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదని చెప్పాలి. ఇప్పటికీ రవాణా సౌకర్యం, రక్షిత మంచినీరు, విద్యుత్తు, విద్యా సౌకర్యాలు లేని ఆదివాసీ గిరిజన గూడేలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం గిరిజనుల కోసం కేటాయిస్తున్న బడ్జెట్ అర్హులైన తమకు దక్కడం లేదని, అభివృద్ధి పథంలో తమకన్నా ముందున్న తమ సోదర తెగ తమ ఫలాలను లాగేసుకుంటోం దన్నది వారి ఆరోపణ.

## ఎవరి హక్కులు వారికి దక్కాలి

గిరిజనుల అమాయకత్వం, లోకజ్ఞానం లేకపోవడం, అభివృద్ధి అవకాశాల వివరాలను తెలుసుకోలేక పోవడం, హక్కులు, అవకాశాలను తెలుసుకొని సాధించుకోలేక పోవడం, వారిలో వెన్నంటి నడిపించే బలమైన నాయకత్వలోపం, దాన్ని కొనసాగించడానికి ఆర్థిక ఇబ్బందులు, నాయకత్వంలో స్వార్ధ ప్రియత్వం పెరిగిపోవడం.. ఇలా రకరకాల కారణాలు వారి అభివృద్ధికి ఆటంకాలుగా కనిపిస్తున్నాయి. కనుక ఆదివాసీ యువత, విద్యాధికులు ఈ ఆటంకాలను అధిగమించడానికి మార్గాలు అన్వేషించాలి.

ఏది ఏమైనా ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం గిరిజన సమీకృతాభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ తదితరాల ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచడానికి ఎంతో కొంత కృషి చేస్తూనే ఉన్నాయి. అయి నప్పటికీ, వారి జీవితాలలో విప్లవాత్మకమైన మార్పు రాలేదన్నది వాస్తవం. కనుక హక్కులు, అభివృద్ధి, అధికారాల కోసం, వారికి ప్రత్యేకంగా సంక్రమించిన చట్టాల పరిరక్షణ కోసం గిరిజన సోదరులు ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయ పోరాటాలు చేపట్టాలి. తమ చట్టాలను పరిరక్షించుకుంటూనే భావసారూప్యం కలిగిన గిరిజనేతరులతో సామరస్యం, సమన్వయంతో వ్యవహరిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగు పడవచ్చు. గిరిజనాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పుకునే ప్రభుత్వాలు కూడా ఆదివాసీ గిరిజనుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధి, సంక్షేమం కోసం, రాజ్యాంగ బద్ధంగా వారికి దక్కవలసిన హక్కులు, అధికారాలు, ఫలాలు దక్కేవిధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు

# 40. అల్ మూ'మిన్

మక్కా అవతరణ

60 మీ ప్రభువు అంటున్నాడు, "నన్ను పిలువండి, నేను మీ ప్రార్థనలు స్వీకరిస్తాను, ఎవరయితే పొగరుమోతు తనంవల్ల నా ఆరాధనకు విముఖులవుతారో వారు తప్పక హీనులూ, నీచులయి నరకంలో ప్రవేశిస్తారు."[84]

**(84వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లా(ర) ప్రకారం ప్రవక్త మహనీయులు (స) సెలవిచ్చారు, "మనిషి అల్లాహ్‌ను వేడుకున్నప్పుడు అల్లాహ్ అతనికి అతను అర్థించిన దాన్నయినా ప్రసాదిస్తాడు లేదా దానికి సమానంగా ఏదయినా విపత్తు అతనిపైకి రానున్నదాన్ని రాకుండా వారిస్తాడు. అయితే అతను ఏదయినా పాపకార్యానికీ, రక్తసంబంధాలను దూరం చేసేందుకూ దుఆ చేసి ఉండరాదు." *(తిర్మిజి)*

పై హదీసు మాదిరిదే మరో హదీసులో ఇంచుమించు ఇదే భావం ఉంది. హ్రజత్ అబూ సయీద్ ఖుద్రీ (ర), ప్రవక్తశ్రీ (స) చెప్పినట్లు ఉల్లేఖించారు, "ఒక ముస్లిమ్ వ్యక్తి ఎప్పుడు ఏ ప్రార్థన వేడుకున్నా, అది ఏదయినా పాపపు కార్యానికీ, రక్తసంబంధాలను తెంచేందుకు కాకపోతే, దాన్ని అల్లాహ్ మూడు విధానాలలో ఏదో ఒక విధంగా స్వీకరిస్తాడు. అతని ప్రార్థనను ఇహలోకంలోనే స్వీకరిస్తాడు, (అతను అర్థించినది ప్రసాదిస్తాడు) లేదా పరలోకంలో ప్రతిఫలం ఇవ్వడానికి భద్రపరుస్తాడు లేదా అటువంటి స్థాయిగల ఏదయినా విపత్తును అతనికి దాపురించకుండా వారిస్తాడు" (ముస్నద్ అహ్మద్).

హ్రజత్ అబూ హురైరా (ర), ప్రవక్తశ్రీ (స) సెలవిచ్చినట్లు ఉల్లేఖించారు, "మీలో ఎవరయినా ప్రార్థించినట్లయితే, 'దేవా నీవు కోరితే నన్ను మన్నించివెయ్యి, నీవు కోరితే నన్ను కరుణించు, నీవు కోరితే నాకు ఉపాధిని ప్రసాదించు" అని అర్థించరాదు. అతను రూఢీగా అర్థించాలి, 'దేవా, నా ఫలానా అవసరాన్ని తీర్చు' అని (బుఖారీ). మరో ఉల్లేఖనం హ్రజత్ అబూ హురైరా చెప్పినదే ఈ పదాలలో వచ్చింది, ఆయన ఇలా సెలవిచ్చారు, "అల్లాహ్‌ను ప్రార్థించండి, ఆయన స్వీకరిస్తాడన్న నమ్మకంతో" (తిర్మిజీ).

ఒక ఉల్లేఖనంలో హ్రజత్ అబూ హురైరా (ర) ప్రవక్త మహనీయులు సెలవిచ్చిన ఈ విషయాన్ని ఉటంకించారు, "దాసుని 'దుఆ' స్వీకరించబడుతుంది, అయితే అతను ఏదయినా పాప కార్యానికీ లేదా రక్త సంబంధం ఖండనకు సంబంధించిన ప్రార్థన చేయరాదు, తొందరపాటునూ ప్రదర్శించరాదు." తొందరపాటు అంటే ఏమిటీ దైవప్రవక్తా! అని అడగ్గా, "మనిషి, నేనెంతో ప్రార్థించాను, చాలా వేడుకున్నాను, నా 'దుఆ' స్వీకరించబడటమే లేదని నేను గమనిస్తున్నాను. ఇలా అనుకుని మనిషి అలసిపోయి ప్రార్థించడం మానుకోవడం– ఇదే తొందరపాటు." *(ముస్లిమ్)*

రెండవ విషయాన్ని దిగువ పేర్కొన్న హదీసులు విశదీకరిస్తున్నాయి.

హ్రజత్ అబూ హురైరా(ర) ఉల్లేఖనం, ప్రవక్తశ్రీ (స) సెలవిచ్చారు, "అల్లాహ్ దృష్టిలో ప్రార్థనకన్నా విలువగల వస్తువు ఏదీలేదు" *(తిర్మిజీ, ఇబ్నుమాజ).*

హ్రజత్ ఇబ్ను మస్‌ఊద్(ర) ఉల్లేఖనం, ఆయన (స) ఇలా సెలవిచ్చారు, "అల్లాహ్‌ను ఆయన అనుగ్రహం కొరకు అర్థించండి, అల్లాహ్, తనను అర్థించడాన్ని ఎంతో ఇష్టపడతాడు." (తిర్మిజీ)

హ్రజత్ ఇబ్ను ఉమర్, హ్రజత్ ముఆజ్ బిన్ జబల్ (ర) ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "ప్రార్థన ఎట్టి పరిస్థితిలోనూ లాభసాటియే. ఇప్పటికీ దాపురించిన విపత్తుల విషయంలోనూ, ఇంకా దాపురించనివాటి విషయంలోనూ ప్రయోజనకరమయినదే. కాగా దైవదాసులారా, మీరు దైవాన్ని తప్పకుండా ప్రార్థిస్తూ ఉండండి." *(తిర్మిజీ, ముస్నద్ అహ్మద్)*

ప్రవక్త మహనీయులు సెలవిచ్చినట్లు హ్రజత్ అనస్(ర) ఉల్లేఖిస్తున్నారు, "మీలో ప్రతి ఒక్కరూ తమ ప్రతి అవసరానికీ దైవాన్ని అర్థించాలి, కడకు అతని పాదరక్షల వారు తెగిపోయినా దానికీ దైవాన్నే ప్రార్థించాలి" *(తిర్మిజీ).*

అంటే మనిషికి తన అధీనంలోనే ఉన్నాయనిపించే వ్యవహారాలలో సయితం వాటికోసం ప్రయత్నం చేసే ముందు అతను దైవాన్ని సహాయం కోసం అర్థించాలి. ఎందువల్లనంటే, ఏ వ్యవహారంలోనయినా మనం చేసే ఏ ప్రయత్నమయినా దైవం ప్రసాదించే సద్బుద్ధి, ఆయన సహాయం లేనిదే ఫలవంతం కాజాలదు. ప్రయత్నానికి పూర్వం ప్రార్థించడం అంటే అర్థం, దాసుడు అనునిత్యం, తన అశక్తత, దేవుని ఆధిక్యతను ఒప్పుకుంటున్నాడన్నమాట.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (4వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 1. సాక్ష్యాధారాల ప్రకరణం

### అధ్యాయం : 15

### ఇఫ్క్ (అపనింద) సంఘటన

### స్త్రీలు పరస్పరం ఒండొకరిలోని మంచిని గురించి సాక్ష్యమివ్వటం

**25)** దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (ర.అ) గారు తనపై అభాండం మోపినవారు అభాండం మోపినప్పటి సంఘటన[1]ను వివరించారు. అయితే అల్లాహ్ స్వయంగా ఆమె గారిని ఆ అభాండం విషయంలో నిర్దోషిగా ప్రకటించాడు. జుహ్రీ ఇలా అన్నారు: ఈ హదీసుకు సంబంధించినంతవరకు ఉల్లేఖకులందరిలో ప్రతి ఒక్కరి ఉల్లేఖనం రెండవ దానిని ధ్రువపరిచేదిగా ఉంది. ఉల్లేఖకుల ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : దైవప్రవక్త(సఅసం) ఏదయినా ప్రయాణానికి బయలుదేరాలని సంకల్పించుకున్నప్పుడల్లా తమ భార్యల మధ్య చీటీలు వేసేవారు. ఎవరి పేరు వస్తే వారినే ప్రయాణంలో తమ వెంట తీసుకెళ్ళేవారు. ఒక యుద్ధ (బనీ ముస్తలఖ్) సందర్భంగా చీటీలు వేసినప్పుడు, నా పేరు వచ్చింది. పరదా ఆజ్ఞ (ఆయత్) అవతరించిన తరువాత జరిగిన సంఘటన ఇది. నేను హౌదజ్ (ఒంటెపై స్త్రీలు కూర్చునే తొట్ల)లోనే ఉండి స్వారీ అయ్యేదానిని. నేను ఆ తొట్లలో కూర్చుని ఉన్న స్థితిలోనే నన్ను దించటం జరిగేది. ప్రయాణమంతా ఇలాగే సాగింది. దైవప్రవక్త(సఅసం) తన యాత్రను ముగించుకుని తిరిగి వస్తున్నారు. మదీనా నగరం మరికొంత దూరాన ఉండగా– రాత్రివేళ మజిలీ చేసిన చోటు నుండి బయలుదేరమని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఈ ఆదేశాన్ని వినగానే నేను లేచి సైనికుల విడిది స్థలం నుండి కొంత దూరం వెళ్ళిపోయాను. కాలకృత్యాలు తీర్చుకున్న మీదట నేను బయలుదేరవలసిన చోటికి వచ్చాను. తీరా నేను వచ్చి నా మెడ దగ్గర చేయి పెట్టేసరికి, నా రత్నాల కంఠహారం కనిపించలేదు. అందువల్ల నేను మళ్లీ కాలకృత్యాలు తీర్చుకున్న చోటికే తిరిగి వెళ్ళాను. ఈ లోగా నా హౌదజ్ (ఒంటె మీది తొట్ల)ను ఒంటెపై పెట్టేవారు వచ్చి దానిని ఎత్తుకెళ్ళి ఒంటెపై పెట్టేశారు. నేను ఆ హౌదజ్‌లో కూర్చుని ఉన్నానని వారు భావించారు. ఆ రోజుల్లో మా ఆడవాళ్ళు చాలా తేలికగా ఉండేవారు. లావుగా ఉండేవారు కాదు. వారి శరీరాలపై మాంసం చాలా తక్కువగా ఉండేది. ఎందుకంటే వారు అల్పాహారం తినేవారు. అందువల్ల వారు నా హౌదజ్ ఎత్తినప్పుడు, దాని బరువు గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే నేను ఆ రోజుల్లో పిన్న వయస్కురాలిని. చాలా తక్కువ బరువు ఉండే దానిని. అందువల్ల వారు నా ఒంటెను తోలుకుని వెళ్ళిపోయారు. ప్రయాణ బృందం బయలుదేరిన తరువాత నా కంఠహారం దొరికింది. నేను విడిది స్థలానికి వచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు. అందుచేత నేను విశ్రాంతి తీసుకున్న స్థలం వద్దకు వచ్చి కూర్చున్నాను. నేను 'హౌదజ్'లో లేనన్న సంగతి తెలుసుకుని వారు తిరిగి వస్తారని తలపోశాను. నేను కూర్చున్న స్థలంలోనే నాకు నిద్ర పట్టింది. సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ(రజి) అటు వైపుగా వచ్చారు. సైనికులు మరచిపోయిన వస్తువులు వెనుక నుంచి ఎత్తుకుని వచ్చి, వాటి యజమానులకు అప్పగించే బాధ్యతపై ఆయన నియమించబడ్డారు. విడిది స్థలంలో ఒక మనిషి నిద్రిస్తున్నట్లు కనిపించగానే ఆయన దగ్గరకు వచ్చారు. పరదా ఆజ్ఞలు రాకముందు ఆయన నన్ను చూసి ఉన్నారు. నిద్రలో ఉన్న నన్ను చూడగానే 'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్' అని బిగ్గరగా పలికారు. నాకు మెలకువ వచ్చింది. ఆయన తన ఒంటెను కూర్చోబెట్టి, దాని ముంగాలును మడతపెట్టారు. (నేను ఇతరుల సహాయం

లేకుండానే స్వయంగా ఒంటెపైకెక్కి కూర్చోవడానికి గాను ఆయన అలా చేశారు). నేను ఒంటెపై స్వారీ అయ్యాను. ఆయన ఒంటె పగ్గాలు పట్టుకుని ముందుండి నడవసాగారు. మేము మా సైనిక దళాన్ని సమీపించేసరికి, మండుటెండలో జనులు విశ్రాంతి కొరకు విడిది చేశారు (జరిగింది మాత్రం ఇంతే. దీని ఆధారంగా) నాశనం కావల సినవారు నాశన మయ్యారు. ఈ అపనింద వ్యవహారంలో కీలకపాత్ర పోషించినవాడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై (అతను మునాఫిక్). తరువాత మేము మదీనా చేరుకున్నాము. నేను ఒక నెల రోజుల వరకూ అస్వస్థతకు గురయ్యాను. ఈలోగా అపనింద మోపినవారి మాటలు ఊపందుకున్నాయి. నాకు జబ్బు చేసినప్పుడు దైవ ప్రవక్త(స) నన్ను ప్రత్యేకంగా కనిపెట్టుకుని ఉండే వారు. కాని ఈసారి ఆయన(స) గారి ప్రేమానురాగాలు నాకు కరువయ్యాయి. ఆయన(స) ఇంట్లోకి వచ్చినప్పుడు సలామ్ చేసేవారు. ఆరోగ్యం ఎలా ఉంది? అని మాత్రం అడిగేవారు. అపనింద మోపినవారు వ్యాపింపజేసే వదంతుల గురించి అసలు నాకేమీ తెలీదు. నా ఆరోగ్యం కాస్త కుదుటపడిన తరువాత నేను ఒకరోజు (రాత్రివేళ) ఉమ్మె మిస్తహ్ వెంట మనాసియ వైపు నడిచి వెళ్ళాను. అది మేము కాలకృత్యాలు తీర్చుకునే బహిర్ భూమి. రాత్రివేళ మాత్రమే మేము అక్కడికి వెళ్ళేవారం. ఆ కాలంలో మా ఇండ్లకు సమీపంలో మరుగుదొడ్లు ఉండేవి కావు. (కాలకృత్యాలు తీర్చుకోవ డానికి) మేము బహిర్ భూమి వెళ్ళే తీరు ప్రాచీన అరబ్బు సంప్రదాయం ప్రకారమే ఉండేది. నేనూ, ఉమ్మె మిస్తహ్ బిన్తె అబీ రుహ్మ్ అలా బహిర్ ప్రదేశానికి నడిచి వెళుతుండగా ఆమె కాలు దుప్పటిలో చిక్కుకుని క్రింద పడిపోయింది. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆమె నోట, "మిస్తహ్ నాశనమవ్వ" అనే మాట వెలువడింది. దానికి నేను, "అయ్యో! నీ నోట ఇలాంటి చెడ్డ మాట వచ్చిందేమిటి? బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న ఒక సహాబీ (పైగా ఆయన నీ కుమారుడు) గురించి నోరు జారావేమిటి?" అన్నాను. "అయ్యో పిచ్చి పిల్లా! నీ గురించి వాళ్ళు చెప్పుకుంటున్నదేమిటో నీవు వినలేదా?" అని ఆమె ప్రశ్నించింది. తరువాత ఆమె, అపనింద మోపినవారు చెప్పే మాటలన్నింటినీ ఏకరువు పెట్టింది. ఆ మాటలు విన్న మీదట నా ఆరోగ్యం మరింతగా క్షీణించింది. నేను ఇంటికి తిరిగి వచ్చిన కొద్దిసేపటికే దైవప్రవక్త(స) కూడా లోపలికి విచ్చేశారు. "ఆరోగ్యం ఎలా ఉంది?" అని క్లుప్తంగా అడిగారు. 'నా తల్లిదండ్రుల దగ్గరకెళ్ళాలనుకుంటున్నాను. అనుమతి ఇవ్వండి' అన్నాను. తల్లిదండ్రుల దగ్గరకెళ్ళి ఈ సంఘటన గురించి ఆరా తీయాలని నాకనిపించింది. దైవప్రవక్త(స) నాకు అనుమతి ప్రదానం చేశారు. నేను నా పుట్టింటికి రాగానే ఈ నీలాపనిందల గురించి నా తల్లి (ఉమ్మె రూమాన్)ని అడిగాను. దానికి మా అమ్మ "అమ్మాయ్! ఈ అవాకులు చెవాకుల గురించి పట్టించుకోకు. దైవసాక్షి! నీలాంటి అందగత్తె ఒక పురుషుని ఇంట భార్యగా ఉండగా, పైగా ఆమెకు సవతులు కూడా ఉండగా, ఇలాంటి మాటల్ని వ్యాపింపజేయకుండా ఉండటమన్నది జరుగదు" అని సముదాయించబోయింది. "సుబ్హానల్లా! (సవతులను అని ఏం లాభం?) ఈ వదంతుల్ని వ్యాపింపజేసేవారు వేరేవారు కదా!" అన్నాను. ఆ రాత్రి నేను అక్కడే గడిపాను. తెల్లవారే వరకూ నా కన్నీళ్ళు ఆగలేదు. నిద్రపట్టలేదు. తెల్లవారిన తరువాత దైవప్రవక్త(సఅసం) తన భార్యకు విడాకులిచ్చే విషయమై సంప్రతించడానికి అలీ బిన్ అబీ తాలిబ్(రజి)ను, ఉసామా బిన్ జైద్(రజి)ను పిలిపించారు. ఎందుకంటే ఈ వ్యవహారంపై ఆనాటి వరకూ 'వహీ' (దైవవాణి) అవతరించలేదు. దైవప్రవక్త(స) తన భార్యలను ఎంతగా ప్రేమిస్తారో ఉసామా (రజి)కు తెలుసు. అందువల్ల ఆయన తదనుగుణంగానే సలహా ఇచ్చారు. ఉసామా ఇలా అన్నారు : 'మీ సతీమణి గురించి చెప్పమంటున్నారా దైవప్రవక్తా! మాకు ఆమె గురించి మంచి తప్ప మరొకటి తెలియదు'.

**(మిగతా వచ్చే సంచికలో)**

25-1. ఇస్లామీయ చరిత్రలో ఇది 'ఇఫ్క్ సంఘటన'గా ప్రసిద్ధి కెక్కింది. అంటే అతిపెద్ద అభాండం లేదా అపనింద అని అర్థం. పైగా ఈ అపనింద ఎవరిపైన? సాక్షాత్తూ దైవప్రవక్త(స) సతీమణి, విశ్వాసుల మాతృశ్రీ హజ్రత్ ఆయిషా(ర.అ)పైన! ఈ సంఘటనకు సమాధానంగా అల్లాహ్ నూర్ సూరాలోని ఆయత్‌లను అవతరింపజేసి, అమ్మ ఆయిషా (ర.అ) సౌశీల్యాన్ని, నిర్దోషిత్వాన్ని ప్రకటించాడు. అంతేకాదు, హదీసు వేత్తలు, ధర్మవేత్తలు ఈ సంఘటన ఆధారంగా అనేక ధార్మిక నియమ నిబంధనలను సంగ్రహించారు.

★★★




# మదీనాలో యూదులు

**- ఎస్.ఎమ్. మలిక్**

**దైవ సందేశహరులు** (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) మదీనాకు హిజ్రత్ చేసి రాక పూర్వం మదీనాలో యూదులు తమ సంపన్నత కారణంగా బలం గల వర్గంగా పెత్తనం చెలాయించేవారు. వారు అరబ్బుల్లా వేషభాషలు, సభ్యతా సంస్కృతులు- అన్నివిధాలా అరబ్బుల రంగు పులుము కున్నారు. కడకు వారు తమ పేర్లు సయితం అరబీ, అరబ్బుల పేర్ల వలెనే పెట్టుకునేవారు. వారు అరబ్బులతో వైవాహిక సంబంధాలూ పెంపొందించుకున్నారు, ఒక్క మతం తప్ప వారికీ అరబ్బులకు మరో తేడా మిగులలేదు. ఇంత జరిగినా వారు అరబ్బుల్లో పూర్తిగా విలీనం కాలేదు, అతి తీవ్రమయిన తమ యూదు దురభిమానాన్ని వారు వదులుకోలేదు. తాము ఇస్రాయీలీయులమన్న కులతత్వం, వంశానుగత దురభిమానం, అహంభావం వారిలో మెండుగా ఉండేది. వారు అరబ్బుల్ని 'ఉమ్మీ' (GENTILE) అనేవారు. అంటే నిరక్షరాస్యులని, ఆటవిక, మూఢ జనులని అర్థం. అయితే వారు అరబ్బుల్ని యూదు మతంలోకి ఆహ్వానించేవారు కారు, తమ జాతివారు తప్ప మరెవరికీ అందులోకి ప్రవేశించే అర్హత లేదని తలంచేవారు.

### కుట్రలూ కుతంత్రాలు!

అయితే యూదు మత పెద్దలు తమ తాయిత్తులు, మంత్ర తంత్రాలు, జోస్యం వగైరాల వల్లనూ సంపాదన, సంపన్నతల వల్లనూ అరబ్బుల్లో, పండితులని, నిష్ఠ గలవారని ప్రఖ్యాతి పొందారు. వడ్డీ వ్యాపారం, బలమయిన ఆర్థిక స్థితి వల్ల అరబ్బులకన్నా వారి పరిస్థితి చాలా బలీయంగా ఉండేది. సిరియా పాలస్తీనా ప్రాంతాల నుంచి వచ్చారు కాబట్టి అరబ్బుల్లో రివాజు లేని అనేక వృత్తి పనుల్లో, కళల్లో బాగా ఆరితేరిన వారవడం చేతను, వారి స్థానం కాస్త ఉన్నతంగా ఉండేది. బయటి దేశాలతో వారి లావాదేవీలు కూడా ఉండేవి. వీటన్నింటి మూలంగా వారు అరబ్బులపైన

పెత్తందారీ చెలాయించేవారు. ఈ స్థానం, స్థాయిని వారు దుర్వినియోగం చేసుకుని అరబ్బుల్లో పరస్పరం తగాదాలు జగడాలు రేకెత్తించి, వారిలో విచ్ఛిత్తి పెంపొందించి పబ్బం గడుపుకునేవారు. ఈ ద్వంద్వ వ్యవహారం వారికి ఉగ్గుతో పోసిన విద్య.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రవక్తశ్రీ(స) రాక, అరబ్బుల్లో ఇస్లామ్ ధర్మం మూలంగా సమైక్యత ఏర్పడటం, వారికీ, అరబ్బులకూ, ఇస్లామీయ సముదాయాలకీ మధ్య 'మదీనా ఒప్పందం' కారణంగా ఎవరూ మరొకరి హక్కులపై చెయ్యి చేసుకోరాదన్న ప్రతిబంధకం ఏర్పడింది. ప్రవక్తశ్రీ మదీనా ఆగమనం, తరువాత ఒప్పందం జరగటం వల్ల యూదుల ఆటలు కొనసాగడం అసాధ్యమయిపోయింది. ఫలితంగా యూదులు ఇస్లామ్‌ను, ప్రవక్త ఉద్యమాన్నీ వ్యతిరేకించడం తమ జాతి ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇస్లామ్‌కు వ్యతిరేకులయిన వారిని తమ మిత్రులుగా చేసుకోవడంతో పాటు ఔస్, ఖజ్‌రజ్ తెగల మధ్య వ్యతిరేకత, శత్రుత్వం కల్పించడానికి శాయ శక్తులా ప్రయత్నించేవారు.

ప్రవక్త మహనీయుల ఆగమనానికి పూర్వం, తమ జాతి, ఇస్రాయీలీయుల ప్రవక్తలు చేసిన భవిష్యవాణి ప్రకారం, ఓ ప్రవక్త రానున్నారని వారు నమ్మేవారు, అలా ప్రకటించేవారు కూడా. మదీనాలోని అరబ్బులు వారి ఈ ఉద్ఘోషణలు విని మక్కాలో ప్రవక్త ముహమ్మద్ ఆవిర్భవించారని వినగానే యూదుల కన్నా తాము ముందుకేగి ఆ ప్రవక్తను ఆహ్వానిం చాలని మదీనాలోని అరబ్బు తెగలయిన ఔస్, ఖజ్రజ్ నాయకులు ప్రవక్తశ్రీ(స)ని మదీనాకు పిలుచుకువచ్చారు. అనేక గుర్తుల వల్ల యూదులు రానున్న ప్రవక్త ముహమ్మద్(స) అని గ్రహించినా తమ కుత్సిత బుద్ధి వల్ల దాన్ని బయట పెట్టలేదు. ఈ సందర్భంలో మహనీయ సఫియ్యా (రజి అల్లాహు అన్‌హా) సాక్ష్యం అన్నిటికన్నా విశ్వసనీయమయినది, ఆవిడ స్వయాన ఓ గొప్ప యూదు పండితుని కూతురు, మరో యూదు పండితుని సోదర కుమార్తె. ఆమె ఇలా చెప్పారు :

"ప్రవక్త మహనీయులు మదీనా విచ్చేసిన తరువాత, మా నాన్న, బాబాయి ఇరువురూ ఆయన్ని కలుసుకునేందుకు వెళ్ళారు. ఆయనతో చాలాసేపు, దాదాపు సాయంత్రం వరకు సంభాషించారు. ఆపైన ఇంటికి తిరిగి వచ్చినప్పుడు వారిరువురూ ఇలా మాటలాడుకోవడం నేను నా చెవులారా విన్నాను :

బాబాయి నాన్నను అడిగారు, "మన గ్రంథాల్లో శుభవార్త ఇవ్వబడిన ప్రవక్త ఈయనేనా?" అని.

దానికి నాన్న, "అవును, దైవం సాక్షి, ఈయనే" అని బదులి చ్చారు.

బాబాయికి ఆ సమాధానంతో తృప్తి కలగలేదు,

ఆయన మళ్ళీ అడిగారు, "మీకు ఈ విషయంలో బాగా నమ్మకం కుదిరిందా?" అని.

నాన్న దృఢంగా పలికారు, "అవును"

బాబాయికి సంశయం కలిగి, "అయితే ఇక మీరేమంటారు?" అని నాన్నను ప్రశ్నించారు.

నాన్న దృఢ సంకల్పంతో పలికారు, "నా బొందిలో ప్రాణము న్నంత వరకు ఇతన్ని వ్యతిరేకిస్తాను, ఇతని మాట చెల్లనేర కుండా చూస్తాను."

వాస్తవమేమంటే రానున్న ప్రవక్త తమ జాతిలో ప్రభవిస్తారని వారు భావించారు, అలాకాక ఆ ప్రవక్త మరో జాతిలో ఆవిర్భ వించడం వారికి కంటగింపుగా మారింది. ఈ మంకుపట్టును దివ్య ఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావించింది :

> కాని వారు కోరుకుంటున్నది వారి ముందుకు వచ్చినప్పుడు, వారు దాన్ని గుర్తించి కూడా విశ్వసించ డానికి నిరాకరించారు. ఇటువంటి తిరస్కారులపైన దైవ శాపం పడుగాక, వారు తమ మానసిక తృప్తి పొందేందుకు ఎటువంటి విషయాన్ని ఆధారంగా ఎన్నుకున్నారు. దైవం ఏ మార్గ బోధనను అవతరింప జేశాడో దాన్ని స్వీకరించేందుకు కేవలం తమ ఈ మొండి


యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

వైఖరి వల్ల నిరాకరిస్తున్నారు- అల్లాహ్ తన అనుగ్రహాన్ని (వహీ, దైవదౌత్యం) తాను కోరిన తన దాసునికి అవతరింపజేశాడు అన్నది, (వారి ఆగ్రహానికి కారణమయింది) కనుక ఇక వీరు శిక్షపైన మరో శిక్షకూ పాత్రులయ్యారు. ఇటువంటి తిరస్కారులకు అతి తీవ్ర పరాభవ పూర్వకమయిన శిక్ష లభిస్తుంది. (అల్ బకర 2: 89,90)

## ద్వంద్వ నీతిపరులు

ద్వంద్వ నీతిని కుర్ఆన్ పరిభాషలో 'నిఫాక్' అని అంటారు. 'నిఫాక్' అంటే ఒకదాన్ని బహిర్గత పరచడం మరొక దాని గోప్యంగా ఉంచడం. కపటులు, ద్వంద్వనీతిని ఆశ్రయించిన వారు తమ ఇస్లామ్ తిరస్కారాన్ని దాచిపెట్టి బయటికి ఇస్లామ్ స్వీకరించినవారిలా నటించేవారు. ఇటువంటి వారిని 'మునాఫిక్'లు అంటుంది కుర్ఆన్. అంటే ద్వంద్వ నీతి పరులు, కపటులు అని భావం. అటువంటి మునాఫిక్‌లలో అబ్దుల్లా బిన్ ఉబై అనే ఖజ్‌రజ్ తెగకు చెందిన పెద్ద ఆసామి ప్రముఖుడు, 'మునాఫికు'ల నాయకుడు. ప్రవక్త(స) మదీనా రాకకు పూర్వం ఔస్, ఖజ్‌రజ్ తెగల నాయకులు ఇతన్ని తమ రాజుగా చేసుకుని సమైక్యంగా ఉందామని నిర్ణయించుకున్నారు. తీరా ఇస్లామ్ ఆవిర్భావం తరువాత, ఔస్, ఖజ్‌రజ్ తెగలు ఇస్లామీయ పతాక నీడలో సమైక్యమయి అతని పట్ల శ్రద్ధ చూపడం మానుకున్నారు. మదీనాలో దాదాపు ప్రతి ఇంట ఇస్లామ్ ప్రవేశించిన తరువాత ఇతను వివశుడయి, తన అనేక మంది అనుయాయులతోపాటు ఇస్లామ్ స్వీకరించి తన నాయకత్వాన్ని కాపాడుకుందామనుకున్నాడు. నిజానికి ఇతను, ఇతని సహచరుల ఆంతర్యాలలో మంట రగులుతూనే ఉండింది. ఇతని ద్వంద్వ నీతి, కాపట్యం అప్పుడప్పుడు బయటపడుతూనే ఉండేది.

దివ్య కుర్ఆన్ ఈ మునాఫికుల దుర్గుణాలను అనేకచోట్ల ఎత్తి చూపింది :

**1) వంచనా శిల్పం :**

జనుల్లో కొందరు, మేము అల్లాహ్‌ను, పరలోక దినాన్ని విశ్వసించాము అని అంటారు. వాస్తవానికి వీరు విశ్వాసులు కారు. వారు దైవాన్నీ, విశ్వసించినవారినీ మోసగిస్తున్నారు; నిజం ఏమిటంటే వారు స్వయంగానే మోసంలో పడిపోయారు, కాని వారికి దాని స్పృహ లేదు. (బకర 2: 15-17)

**2) ఆత్మ వంచన :**

లేదా వారి ఉపమానం ఇలా ఉంది, ఆకాశం నుండి కుంభవృష్టి కురుస్తోంది, దానితోపాటు చిక్కటి చీకటి, ఉరుములు, మెరుములు. వీరు ఉరుముల గర్జన విని ప్రాణభయంతో చెవుల్లో వ్రేళ్లు దోపుకుంటారు. అల్లాహ్ సత్య తిరస్కారుల్ని అన్ని దిశల నుండీ ఆవరించి ఉన్నాడు. (బకర 2: 19)

**3) ద్వంద్వ విధానం :**

వీరు విశ్వాసుల్ని కలుసుకున్నప్పుడు మేము విశ్వాసం గైకొన్నాము అని అంటారు, తాము ఒంటరిగా తమ షైతానులను కలుసుకున్నప్పుడు, మేము నిజంగా మీతోపాటే ఉన్నాము, వారితో ఇట్టే పరాచికాలాడుతున్నాము అని అంటారు. (బకర 2: 14)

**4) సందేహం, సంశయం :**

మెరుముల వల్ల వారి పరిస్థితి ఏమిటంటే, పిడుగు వారి కంటిచూపును దోచుకుపోతుందేమో అనిపిస్తుంది; కాస్త వెల్తురు కనిపించినట్లు అగుపిస్తే అందులో కొంత దూరం నడుస్తారు, మళ్ళీ చీకటి ఆవరిస్తే నిలిచిపోతారు. (బకర 2: 20)

**5) భయం, పిరికితనం :**

వారు దైవం మీద ప్రమాణం చేసి మరీ చెబుతారు, మేము మీతోపాటే ఉన్నామని, నిజానికి వారు ఎట్టి పరిస్థితిలోనూ మీతో లేరు. వాస్తవంగా వారసలు మీరంటే భయవిహ్వాలురయి ఉన్నారు.

(అత్ తౌబా 9: 56)

మదీనాలోని ఈ కపటులు అత్యధికంగా వయసు మీరిన వారు, శ్రీమంతులు. వీరి ఆస్తులు మదీనాలో నలువైపులా వ్యాపించి ఉండేవి. అందువల్ల ముస్లిములతో కలసి ఉండటంలోనే తమ శ్రేయం, మేలు, ఔచిత్యం ఉన్నాయని తలిచేవారు.

---

*ఆధారం : 1) సీరతున్నబీ, ఇబ్ను హిషామ్ : సం.1; పు.576, 577*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3; పు.75-90*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.5; 198-202*



# ముహర్రం సందేశం

- షరీఫా, విజయవాడ

**ఆకాశాన్ని,** భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటి నుండి, మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరైన గణన పద్ధతి. కనుక ఈ నాలుగు మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.'' (అత్ తౌబా: 36). అంటే సూర్య, చంద్ర, భూగోళాలను దైవం సృష్టించిన నాటి నుంచే దీని లెక్క ప్రారంభమయింది. ఇస్లామ్ సంవత్సరాదిని హిజ్రీ కేలండరుగా నామకరణం చేశారు. హజ్రత్ ఉమర్(ర) పరిపాలనా కాలంలో హిజ్రీ కేలండర్‌కు రూపకల్పన జరిగింది. హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) హజ్రత్ ఉమర్(రజి)కు 'మీ దగ్గర నుంచి మాకు లేఖలైతే అందుతున్నాయి. కానీ ఆ లేఖల్లో తేదీలు లేకపోవడంతో అవి ఎప్పుడు రాశారో మాకు అస్సలు అంతు పట్టటంలేదు' అని లేఖ రాశారు. దీనిపై హజ్రత్ ఉమర్ (ర) దీర్ఘాలోచనలు, మంతనాలు జరిపారు. ఎక్కువ మంది ముహర్రమ్ నెలను ప్రారంభపు నెలగా ప్రతిపాదించటంతో ఇస్లామ్ నూతన సంవత్సరాది ముహర్రమ్ నెలగా ప్రారంభించారు. ముహర్రమ్ నెల ఎన్నో విశిష్టతలతో, ఎన్నో శుభాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. చంద్రమానం ప్రకారం కేలండర్‌ను రూపొందించడంతో మన ఆరాధనా పద్ధతులు, పర్వదినాలు, రమజాన్ ఉపవాసాలు, హజ్ యాత్ర, పవిత్ర నెలలు ఇలా అన్నీ చంద్రమాన కేలండరుతో ముడిపడి ఉన్నాయి.

## ముహర్రమ్ నెల ఉపవాసాలు

ఈ నెలలో ఉండే ఉపవాసాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఒక సహచరుడు ప్రవక్త(స)ను ఇలా అడిగాడు: ''రమజాన్ నెలతోపాటు వేరే ఏ నెలలో ఉపవాసాలు పాటించాలి?''. దానికి ప్రవక్త(స) ''రమజాన్ నెల తర్వాత ఉపవాసాలు పాటించదలుచు కున్న వారు ముహర్రమ్ నెలలో ఉపవాసాలు పాటించండి. ఎందు కంటే ఇది అల్లాహ్ నెల. ఇందులో ఒకరోజు ఉంది. ఆ రోజున అల్లాహ్ ఒక జాతి తౌబా (పశ్చాత్తాపాన్ని) స్వీకరించాడు. అదే రోజు మరో జాతి తౌబాను కూడా స్వీకరిస్తాడు'' అని బోధించారు (తిర్మిజీ). హజ్రత్ ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్ అలైహిస్సలాంలు కూడా ముహర్రమ్ నెలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలు కూడా ముహర్రమ్ నెలను పవిత్ర నెలగా, అల్లాహ్ నెలగా పరిగణించాయి. ముహర్రమ్ నెల పదో తేదీని 'ఆషూరా' అంటారు. అష్ అంటే పది అని అర్థం. మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : ఆషూరా ఉపవాసం పాటించడం వల్ల గత ఏడాది చేసిన పాపాలన్నీ తుడిచిపెట్టుకుపోతాయి (తుడిచి వేయబడ తాయి). హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా ఉల్లేఖించారు: ''దైవప్రవక్త(స) మక్కా నుండి మదీనా వలస వచ్చినపుడు అక్కడి యూదులు ఆషూరా (ముహర్రమ్ పదవ తేదీన) రోజా పాటించడం గమనించారు. అప్పుడాయన వారిను ద్దేశించి 'మీరు ఒక రోజు ఉపవాసం పాటిస్తున్నారు కదా! మీ ధర్మంలో దీనికున్నటువంటి ప్రత్యేకత ఏమిటి? అని ప్రశ్నించారు. దానికి వారు ''మా దృష్టిలో ఇది చాలా ఔన్నత్యం గల రోజు. దైవం ఈ రోజే మూసా(అ)కు ఆయన జాతి బనీ ఇస్రాయీల్‌కు విముక్తిని ప్రసాదించి, ఫిరౌన్‌ను, వాడి సైన్యాన్ని జల సమాధి చేశాడు. అప్పుడు మూసా (అ) అల్లాహ్ అనుగ్రహానికి కృతజ్ఞతగా ఈ రోజు ఉపవాసం పాటించారు. అందుకని ఆయన్ని అనుస రిస్తూ మేము కూడా ఉపవాసం పాటిస్తాము'' అని చెప్పారు. ప్రవక్త(స) కేవలం ఆషూరా రోజు ఉపవాసం ఉండటాన్ని నిషేధిం చారు. యూదులు, నసారాలు (క్రైస్తవులు) పదో తేదీన ఉపవాసం ఉంటారు. కనుక మీరు ''పదితోపాటు 9 లేదా 11వ తేదీ రోజును కలుపుకుని ఉపవాసం ఉండండి'' అని సెలవిచ్చారు. ముహర్రం నెల వచ్చిందంటే ముస్లిం సమాజంలో ఎన్నో అపోహలు మొదలవు తాయి. సంతాప నెలగా ఈ నెలను భావించటం బాధాకరం. ఈనాటి శాస్త్ర సాంకేతిక యుగంలోనూ, మూఢంగా, అజ్ఞానంగా, పాతకాలపు ఆచారాలనే పాటిస్తూ ఉండటం శోచనీయం. ఈ నెలను 'అపశకునంగా' భావిస్తూ వివాహం లాంటి శుభకార్యాలను వాయిదా వేయటం చూస్తున్నాం. కాలగమనంలో ఎన్నో మంచీ,

చెడులు జరుగుతూ ఉంటాయి. చరిత్రను పరిశీలిస్తే ఎన్నో ఉపద్రవాల నుండి, ఆపదల నుండి విముక్తి లభించిన మాసంగా, శుభాల సరోవరంగా ఈ ముహర్రం నెల ప్రాముఖ్యత మనకు తెలుస్తుంది. దైవప్రవక్తలకు యౌమె ఆషూరాకు ఎంతో అవినాభావ సంబంధం ఉంది. ఈ ఆషూరా రోజునే ఆది మానవులైన ప్రవక్త ఆదమ్(అ) సృష్టించబడ్డారు. అదే రోజున ఆయన స్వర్గంలో ప్రవేశించారు. అదే రోజున ఆయన పశ్చాత్తాపం స్వీకరించబడింది. ఆషూరా రోజునే హజ్రత్ నూహ్ ప్రవక్త పడవ 'జూదీ' పర్వతంపై ఆగింది. ఆషూరా రోజునే హజ్రత్ ఇబ్రాహీం (అ)ను అగ్నిగుండంలో పడవేసిన రోజు. ఆ అగ్నిగుండం నుండి సురక్షితంగా రక్షించబడిన రోజు. ఫిరౌన్ తన సైన్యంతో సహా సముద్రంలో జల సమాధి అయిన రోజు. హజ్రత్ అయ్యూబ్ (అ)కు వ్యాధి నుండి స్వస్థత చేకూరిన రోజు. హజ్రత్ యాకూబ్ (అ)కు చూపు ప్రసాదించబడిన రోజు. హజ్రత్ యూసుఫ్(అ) బావి నుంచి, యూనుస్(అ) చేప కడుపు నుండి బయటకు వచ్చిన రోజు. హజ్రత్ ఈసా(అ) జననం, ఆకాశాల వైపు ప్రయాణం ఈ రోజే జరిగాయి. ఇదీ యౌమె ఆషూరా చారిత్రక నేపథ్యం. కానీ ముహర్రం అనగానే అందరికీ గుర్తుకు వచ్చే పేర్లు హజ్రత్ హసన్ (ర), హజ్రత్ హుసైన్(ర). ముఖ్యంగా చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్(స) మనుమలైన వీరు ఖిలాఫత్ పరంగా చూపిన అనన్య త్యాగాలను స్మరించుకుంటూ ఉంటాము. కర్బలా దుర్ఘటనను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటాము. ఎన్నో శుభాలు కలిగిన యౌమె ఆషూరా రోజునే ఈ కర్బలా ఘటన జరిగింది.

## కర్బలా ఘటన

దైవ సందేశహరుడైన హజ్రత్ ముహమ్మద్(స) ఇస్లామీయ రాజ్య స్థాపన (ఖిలాఫత్) చేశారు. ప్రవక్త(స) తర్వాత 'ఖుల్ఫా యె రాషిదీన్'గా హజ్రత్ అబూబక్ర్(రజి), హజ్రత్ ఉమర్(రజి), హజ్రత్ ఉస్మాన్(ర), హజ్రత్ అలీ(రజి) ప్రసిద్ధి చెందారు. హజ్రత్ అలీ(ర) షహాదత్ తర్వాత ఒక హింసాత్మక విప్లవం తలెత్తింది. దాంతో ఖిలాఫత్ (దైవ ప్రాతినిధ్య పరిపాలన) పటాపంచలయ్యింది. ఒక రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న హజ్రత్ ముఆవియా రాజ్యాన్ని చేజిక్కించుకున్నారు. హజ్రత్ ముఆవియా (ర) మరణానంతరం అతని కుమారుడు యజీద్ హింసా దౌర్జన్యాలతో పాలించటం ఆరంభించాడు. ఈ మధ్యకాలంలోనే కుట్ర జరిపి హజ్రత్ ఇమాం హసన్ (రజి)కు విషం ఇప్పించి హతమార్చాడు. అధర్మం, దౌర్జన్యాలతో స్థాపించబడ్డ యజీద్ ప్రభుత్వానికి తలవంచేందుకు ఇమాం హుసైన్ (రజి) ఇష్టపడలేదు. ప్రవక్త(స) మనవడమైన ఇమాం హుసైన్(ర)కు కూఫా వాసులు "మేము మిమ్మల్ని ఖలీఫా చేయాలనుకుంటున్నాం. యజీద్ పాలన మాకు ఇష్టంలేదు" అంటూ అసంఖ్యాకమైన ఉత్తరాలు వ్రాశారు. తన స్వంత బాబాయి కుమారుడైన 'ముస్లిం'ను అసలు వాస్తవికతను చూసి వచ్చేందుకు కూఫా పంపారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న యజీద్ కూఫా పట్టణంలోనే 'ముస్లిం'ను చంపించాడు. ఆ తర్వాత ఇమామ్ హుసైన్(రజి) మదీనా నుండి కూఫా (ఇరాక్)కు తన కుటుంబ సభ్యులతో సహా బయలుదేరారు. స్నేహితులు, బంధు మిత్రులు వారించినా 'నా కర్తవ్యం, విద్యుక్త ధర్మం నన్ను పిలుస్తుంది'. ఎలాగైనా అక్కడకు పోవలసిందే' అని బదులు ఇచ్చారు. ధర్మస్థాపనకై వెడలిన ఈ బృందం కర్బలా మైదానం చేరగానే యజీద్ సాయుధ సైన్యం అడ్డగించింది. కాలుతున్న ఇసుక దిన్నెలను కర్బలా అంటారు. అంటే గండం, అశుభం, దుఃఖం అని అర్థం. ఇమాం హుసైన్(ర) తాను కేవలం చర్చల కోసమే రాజధానికి వెళుతున్నానని ఎంతగా నచ్చజెప్పినా ఇమాం మాటల్ని ఖాతరు చేయకుండా యజీద్ సైన్యాధిపతి 'యజీద్‌ను రాజుగా గుర్తించవలసిందే, లేదంటే సమరమే' అని కయ్యానికి కాలు దువ్వాడు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సిద్ధమైన ఇమాం హుసైన్ (ర) గత్యంతరం లేక యుద్ధానికి సిద్ధమయ్యారు. కానీ ఇమాం హుసైన్(ర) యుద్ధ సంకల్పంతో రాలేదు కాబట్టి సరైన ఆయుధాలే లేవు. అయినా శక్తివంచన లేకుండా పోరాడుతూ ఇమాం పరివార సభ్యులు ఒక్కొక్కరుగా నేలకొరిగారు. కర్బలా మైదానం రక్తపుటేరు లతో ఎర్రబడింది. అది ముహర్రం నెల పదవ తేదీ శుక్రవారం. వందలాది మంది శత్రు సైనికులను తన అనన్య ధైర్య సాహసా లతో ఇమాం హుసైన్(ర) ఒక్కరే వీరోచితంగా పోరాడుతున్నారు. జుహ్ర్ నమాజ్ సమయం మించిపోతుందని ప్రార్థన చేసుకోవటా నికి కొన్ని నిమిషాలు అవకాశం ఇవ్వమని సైన్యాధిపతిని అభ్యర్థిం చారు. యుద్ధనీతిలో భాగంగా ప్రార్థనకు అవకాశమిచ్చిన శత్రు సైన్యం ఇమాం సజ్దా నుండి లేస్తే తమకు పరాజయం తప్పదని భావించి సజ్దా స్థితిలోనే బరిశెతో పొడిచి చంపారు. దొంగదెబ్బ తీసి, ప్రార్థనలో ఉన్న ఆ మహనీయుడ్ని చంపి ఆనందంతో చిందులు తొక్కారు. మృతవీరుల తలలను బరిశెలకు, బల్లాలకు గుచ్చి గంతులేశారు. పలావులు వండుకుని, పానకాలు తాగారు. ఇదీ క్లుప్తంగా ఆనాడు జరిగిన కర్బలా దుర్ఘటన.

సత్యం, ధర్మం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంభవించిన అనివార్య పరిణామం. ఇమాం హుసైన్ షహాదత్ మానవ లోకానికి గొప్ప ఆదర్శాన్ని బోధిస్తుంది. కేవలం కర్బలా సంఘటననే ప్రత్యేకించుకుని ఈ నెలలో దైవప్రవక్తలకు గొప్ప గొప్ప విజయాలు వరించిన విషయాన్ని విస్మరించరాదు. ఇమాం హుసైన్(ర) త్యాగానికి గుర్తుగా మనం కూడా 'ప్రజాస్వామ్య పరిరక్షణా' స్ఫూర్తిని పొందాలి. నూతన సంవత్సరాన్ని మంచి పనులతో స్వాగతిస్తూ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. మనిషి ధన, మాన ప్రాణాలకు రక్షణ కల్పించాలి అన్నదే ముహర్రం సందేశం.




**నా ప్రియ సోదరి, సోదరుడా!**

ఈ జీవితం ముగిసాక మరో జీవితం ఉందనే వాస్తవాన్ని గత వారం లేఖలో చెప్పాను. ఇది సాధ్యమా అని మీరు ఆశ్చర్య పోవచ్చు. మనిషి ప్రాణం పోయాక, మట్టిలో కలిసిపోయాక, మంటల్లో కాలి బూడిదయ్యాక, మృతదేహాన్ని మరేదైనా పశు పక్ష్యాదులు, క్రూరమృగాలు తిన్నాక, సముద్రంలో కలిసి పోయాక మళ్లీ ఎలా బ్రతకగలడు?

దీనికి నేనెలాంటి ఆధారమూ ఇవ్వలేను, దేవుడు చెప్పే మాటల్లో ఉన్నంత ప్రభావం నా మాటల్లో ఉండదు గనుక. ఇది నన్ను, మిమ్మల్ని, సమస్త సృష్టిని సృష్టించిన సృష్టికర్త, యజమాని మాటలు. ఈ మాటలు ఆ ప్రభువు గ్రంథంలో నుంచి తీసుకోబడ్డవి. ఈ గ్రంథం ప్రస్తుతం ఏ జాతి హస్తగతమై ఉందన్న విషయాన్ని చూడకండి. ఇందులో చెప్పే మాటలు ఎంత సత్యవంతమైనవో చూడండి. మనిషి జీవిత పరమార్థం, సృష్టి సత్యాలను గురించి మానవాళికి వివరిస్తుంది. జీవితంలో ఒక్కసారైనా ఈ పుస్తకంలో చెప్పిన విషయాల గురించి యోచించడం మనందరి కర్తవ్యం. మనిషి చనిపోయాక తిరిగి బ్రతికించే, మరో జీవితాన్ని ప్రసాదించే విషయాలను గురించి పలు విధాలుగా వివరించాడు. రండి దీని గురించి చింతన చేద్దాం.

మేము మానవుడిని వీర్య బిందువుతో సృజించిన విషయం అతను చూడటం లేదా? అయినా అతడు బహిరంగ ప్రత్యర్థిగా నిలబడ్డాడు. ఇప్పుడు అతడు మాకు పోలికలు కల్పిస్తున్నాడు, తన పుట్టుకనే మరిచిపోతున్నాడు. పైగా, శిథిలమై పోయిన ఈ ఎముకలకు తిరిగి ఎవరు జీవం పోస్తారు? అని వాదిస్తున్నాడు. అతడికి ఇలా చెప్పు, "మొదట వాటిని సృష్టించిన వాడే మళ్లీ వాటికి జీవం పోస్తాడు." సృష్టికి సంబంధించిన ప్రతి విషయమూ ఆయనకు తెలుసు.

(దివ్య ఖుర్‌ఆన్ 36: 77-79)

ఆకాశాలనూ భూమినీ సృష్టించగలిగిన వాడు వీరిలాంటి వారిని పుట్టించలేడా? ఎందుకు చేయలేడు, ఆయన మహా నిపుణుడైన సృష్టికర్త అయినప్పుడు? ఆయన ఏదైనా చేయ దలచుకున్నప్పుడు, దాన్ని కేవలం "అయిపో" అని మాత్రమే ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. ప్రతి విషయానికి సంబంధించిన సర్వాధికారాలు తన చేతిలో ఇముడ్చుకున్న ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన సన్నిధికే మీరంతా మరలిపోవలసి ఉంది. (దివ్యఖుర్‌ఆన్ 36:81-83)

అల్లాహ్ సూచనలలో ఒక సూచన ఏమిటంటే, ఎండిపోయిన నేలపై మేము వర్షం కురిపించగానే, అది అకస్మాత్తుగా పులకించటాన్నీ, ఉబికిపోవటాన్ని నీవు గమనిస్తావు. నిశ్చయంగా ఈ మృతభూమిని బ్రతికించి లేపే దేవుడే మృతులకు కూడ ప్రాణభిక్ష పెడతాడు. నిస్సందేహంగా ఆయన ప్రతి దానిపై అధికారం కలిగిఉన్నాడు. (దివ్యఖుర్ఆన్ 41:39)

ఈ ఆకాశాన్నీ, ఈ భూమినీ, వాటి మధ్య ఉన్న వస్తువులనూ మేము వినోదం కోసం సృష్టించలేదు సుమా. వాటిని మేము సత్యంతోనే సృష్టించాము. కాని వారిలో అనేకులు ఎరుగరు. వారందరూ లేపబడటానికి నిర్ణయించబడిన సమయం తీర్పు దినమే. ఆనాడు దగ్గర బంధువు అయినాసరే తన దగ్గర బంధువుకి కూడా ఎంత మాత్రం ఉపయోగపడడు. ఎవరి నుండీ వారికి ఏ సహాయమూ లభించదు. అల్లాహ్‌యే ఎవరి మీదనయినా కరుణ చూపితే తప్ప. ఆయన శక్తిమంతుడు, కరుణామయుడూను. (దివ్యఖుర్ఆన్ 44:38-40)

ఏ దేవుడైతే ఈ భూమినీ, ఈ ఆకాశాన్నీ సృష్టించాడో, వాటిని సృష్టించటంలో అలసిపోలేదో, ఆ దేవుడు మృతులను తప్పకుండా బ్రతికించి లేపగల శక్తిని కూడ కలిగి ఉన్నాడనే విషయం వారికి తోచటం లేదా? ఎందుకు కలిగిలేడు, నిశ్చయంగా ఆయన ప్రతి దానినీ చేయగల శక్తి సామర్థ్యాలు కలవాడు. (దివ్య ఖుర్ఆన్ 46:33)

కరుణామయుడైన దేవుడు తన దాసుల్ని అనంతంగా ప్రేమిస్తాడన్న విషయం మీకు పై ఆధారాలు, ఆయన చెప్పే విధానాన్ని బట్టి మీకు బోధపడే ఉంటుంది. ఆయన మన కంటికి కనపడకపోయినా మన బుద్ధిజ్ఞానాల ద్వారా ఈ ఆధారాలపై యోచించాలని పిలుపునిస్తున్నాడు. సృష్టికర్త ఇచ్చిన ఈ సందేశాన్ని ప్రశాంత మనస్సుతో ఆలోచించండం. ఈ మాటలను విశ్వసించినందుకు ఇచ్చే బహుమతి కూడా విలువైనది. దీన్ని తిరస్కరించిన వారికి ఇచ్చే శిక్ష కూడా ఘోరమైనది.

దేవుడు మనల్ని ఆచితూచి అడుగేసే, సన్మార్గాన్ని పొందే భాగ్యాన్ని ప్రసాదించుగాక. (ఆమీన్)

## మంచిర్యాల వరద బాధితులకు ఎంపీజే చేయూత



**మంచిర్యాల** పట్టణం ఎన్టీఆర్ నగర్‌లో వచ్చిన గోదావరి వరద ముంపు బారిన పడి వందకుపైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వారి ఇళ్లన్నీ నీట మునిగిపోయాయి. కళ్ల ముందే ఇంటి సామగ్రి మొత్తం వరదలో కొట్టుకుపోయింది. వారు కట్టుబట్టలతో మిగిలి పోయారు. ఆ బాధితులందరికీ మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ తెలంగాణ శాఖ అండగా నిలిచింది. నిరాశ్రయులయినవారందరికీ ఆశ్రయం కల్పించి, ఆహారం అందించారు. ఎంపీజే తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షులు అహ్మద్ అబ్దుల్ నయీమ్, తమ బృందంతో కలిసి మంచిర్యాల వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి అందజేశారు. బీడీ లీవ్స్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ చేయూత అందించారు. వరద బాధితులందరితో మాట్లాడారు. వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు.

### పెళ్లి సామగ్రి అందజేత..

తమ బిడ్డల పెళ్లిళ్లకు తెచ్చిన సామానంతా వరదలో కొట్టుకుపోయిందని ఎన్టీఆర్ నగర్ వరద బాధితులు పలువురు కన్నీరుమున్నీరవుతున్నారు. పెళ్లికి తెచ్చిన సామగ్రి మొత్తం నీట మునిగిపోయిందని వారు ఎంపీజే అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ దృష్టికి తీసుకెళ్లారు. వారి గోడును విన్న ఆయన ఆ కుటుంబాలకు పెళ్లి సామాను అందజేస్తామని అన్నారు.




ఎవరి హృదయంలోనైతే ధైర్యం, స్థిరత్వం అనే సుగుణాలు ఉండవో వారు తమ లక్ష్యంలో ఎన్నడూ విజయం సాధించలేరు. దృఢ సంకల్పం, తన లక్ష్యంపై దృష్టి మనిషి హృదయంలో ధైర్యాన్ని, శక్తిసామర్థ్యాలను ప్రసాదిస్తాయి. ఒకవేళ మనిషి ఈ సుగుణాన్ని దైవధర్మ సంస్థాపన కోసం వినియోగించినట్లయితే అతను ఇహపర లోకాల సాఫల్యం వైపునకు అడుగులు ముందుకు వేసినట్లే. కనుక ధర్మం విషయంలో స్థిరత్వానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. గొప్ప బహుమానమూ ఉంది. ఈ విషయాన్ని కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఇలా తెలియజేశాడు: 'అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా దైవదూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు: భయపడకండి, బాధపడకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి. మేము ఈ ప్రాపంచిక జీవితంలో కూడా మీకు సహచరులుగా ఉంటాము. పరలోకంలో కూడా. అక్కడ మీరు కోరినదల్లా మీకు లభిస్తుంది; మీరు ఆశించే ప్రతి వస్తువూ మీదవుతుంది. ఇవీ మీకు లభించే ఆతిథ్యపు ఏర్పాట్లు. క్షమాశీలుడూ, కరుణామయుడు అయిన దేవుని వైపు నుండి.' (41: 30-32)

ఇస్లామ్ ధర్మం మౌలిక విషయం అల్లాహ్‌యే ఏకైక ప్రభువు అని విశ్వసించటం. ఆ విశ్వాసంలో ఎవ్వరికీ రవ్వంత స్థానమూ ఉండదు. ఏకైక ప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించండి అంటే ఆయనకు లొంగిపోవటం, ఆయనకే శిరసావహించటం, ఆయన ఆజ్ఞలనే పాలించటం. జీవితాంతం ఆయన చూపిన మార్గాన్నే అవలంబించటం అన్నమాట. సత్య విషయమేమిటంటే, మనల్ని పుట్టించి, పాలిస్తున్న సృష్టికర్తనే కదా మనం విశ్వసించేది, శిరసావహించేది, పాలించేది. కాని ఈ విషయాన్ని హృదయాంతరాలు అంగీకరించినా మనస్సు అడ్డుపడుతూ ఉంటుంది. దానికి తోడు ఆగర్భ శత్రువైన షైతాన్ అడ్డుపడుతూ ఉంటాడు. దాని కారణంగా అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతూ ఉంటాయి. ఈ ఆటంకాలన్నింటినీ ఛేదించుకుంటూ ముందుకు దూసుకుపోవలసి ఉంటుంది. విశ్వాసాన్ని స్థిరంగా ఉంచుకోవటానికి క్షణం క్షణం శ్రమించవలసి ఉంటుంది. ఇది కొత్త విషయం ఎంత మాత్రమూ కాదు. ఆది నుంచే జరుగుతూ వచ్చింది. అంతమయ్యే వరకు జరుగుతూ ఉంటుంది.

ఈ దుష్ట శక్తుల నుంచి రక్షణ పొందటానికి ఆ అల్లాహ్‌యే మనిషికి కొన్ని వాక్యాలను కూడా ఈ విధంగా నేర్పాడు. నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను. దుష్టభావాలు రేకెత్తించే వాడి కీడు నుండి వాడు మాటిమాటికీ మరలి వస్తూ ప్రజల మనస్సుల్లో దుష్ట భావాలను రేకెత్తిస్తాడు. వాడు జిన్నాతుల జాతికి చెందినవాడైనా కావచ్చు లేదా మానవ జాతికి చెందినవాడైనా కావచ్చు. ఇటువంటి మరి కొన్ని దుఆలు చేసుకుంటూ విశ్వాసాన్ని కాపాడుకోవచ్చు, దానిపై స్థిరంగా ఉండవచ్చు.

చరిత్ర సాక్ష్యంగా ఉంది, అన్ని కాలాలలో అల్లాహ్‌ను విశ్వసించి, దానిపై స్థిరంగా ఉన్నవారికి చాలామంది శత్రువులైపోతారు. వారిని నానావిధాలుగా కష్టాలపాలు చేస్తారు. విశ్వాసులు ఆ శత్రువులకు ఎలాంటి నష్టాన్ని కలగజేయకపోయినా వారు తమ శత్రుత్వంలో మరింత అంధులైపోయారు. చివరకు విశ్వాసులే విజయం సాధించారు. ప్రవక్త నూహ్(అ) నుంచి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) వరకు ఇదే విషయం కొనసాగింది. ఆయన(స)

ఎవరికీ హాని తలపెట్టలేదు. ఎవ్వరూ ఇతరులకు హాని తలపెట్ట వద్దని బోధించారు.

ఇస్లామ్ ధర్మం విశ్వాసులకు మంచి విషయాలను బోధిస్తుంది. వాటిని ఆచరించమని ప్రోత్సహిస్తుంది. చెడు విషయాలను నిరోధిస్తుంది. వాటికి దూరంగా ఉండమని బోధిస్తుంది. వాటినే ప్రచారం చెయ్యమని అంటుంది. ఖుర్ఆన్ గ్రంథంలో ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేశాడు : అల్లాహ్ వైపునకు పిలిచి, మంచి పనులు చేసి నేను ముస్లిమ్‌ను అవి ప్రకటించే వ్యక్తి మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు. ప్రవక్తా! మంచీ చెడు ఒకటికావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు. ఈ సుగుణ యోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యంకాదు. ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ దక్కదు. ఒకవేళ నీకు షైతాను నుండి ఏదైనా దుష్ప్రేరణ కలిగితే అప్పుడు అల్లాహ్ శరణు కోరుకో, ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడును. (41: 33-35)

ఈ మంచి సుగుణ యోగంపై విశ్వాసి స్థిరంగా ఉండదలచి నప్పుడు, సహనం వహిస్తూ ఉన్నప్పుడు, మనసుపై అదుపును సాధిస్తూ ఉన్నప్పుడు, షైతాన్ ప్రేరణ ద్వారా ఆగ్రహం కలిగి నట్లయితే దూషించేవారు, నిందలు మోపేవారు అయిన ప్రత్యర్థుల మాటలకు మనసులో ఆగ్రహం కలుగుతూ ఉన్నట్లయితే, మాటకు మాట, దెబ్బకు దెబ్బ తీయాలనే సంకల్పం ఏర్పడినట్లయితే, ప్రత్యర్థుల స్థాయికి అతను దిగి రావాలనే భావం కలుగుతూ ఉన్నట్లయితే అప్పుడు విశ్వాసి అల్లాహ్ శరణు కోరుకోవాలి. విశ్వాసి దైవబోధనలపై స్థిరంగా ఉన్నట్లయితే అప్పుడు అల్లాహ్‌యే అతనికి తన సహాయ సహకారాలను అందిస్తాడు. ఇదే విషయాన్ని అల్లాహ్ బోధిస్తున్నాడు.

దైవ సహకారాన్ని మనం ఒక ఉపమానం ద్వారా అర్థం చేసుకో వచ్చు. అప్పుడప్పుడే నడక నేర్చుకునే తన చిన్నారిని తండ్రి నిల్చోబెట్టి తన వద్దకు రమ్మని చేతులు చాచి పిలుస్తాడు. వాస్తవానికి ఆ చిన్నారి తన వద్దకు రాలేడని మధ్యలోనే పడిపోతాడని అతనికి తెలుసు. కాని అతను తన చిన్నారి తన వద్దకు రావటానికి అడుగు ఎత్తి అడుగు వేస్తే వెంటనే తను ఆదుకుంటానని, కింద పడకుండా కాపాడుకుంటానని భావించే పిలుస్తున్నాడు. ఆ చిన్నారి ప్రయత్నం చేస్తూ క్రింద పడిపోతూ ఉండగా తండ్రి వెంటనే వెళ్ళి బాబును ఎత్తుకుని హృదయానికి హత్తుకుంటాడు. సంతోషంతో ఉబ్బితబ్బిబైపోతాడు. అల్లాహ్ కూడా మనిషి చేసే ప్రయత్నాన్ని చూస్తాడు. ఒకవేళ మనిషి చిత్తశుద్ధితో ప్రయత్నించి కష్టాల పాలైనట్లయితే ఆయన తప్పకుండా చేయూత అందిస్తాడు.

ధర్మంపై స్థిరంగా ఉండాలంటే బయటి శత్రువుల కంటే తన లోపలి శత్రువు పట్ల అత్యంత జాగరూకతగా ఉండాలి. అదే మనిషి మనస్సు. అడుగడుగునా అది ఆటంకాలను కలుగ జేస్తుంది. ఆశలను, అత్యాశలను రేకెత్తిస్తుంది. కోరికలను ప్రేరేపిస్తుంది. భోగభాగ్యాల వైపునకు ఆహ్వానిస్తుంది, ఆకర్షిస్తుంది. మనిషి తన ఆశయం పట్ల దృఢత్వాన్ని ప్రదర్శించకపోయి నట్లయితే క్రమక్రమంగా అతడు దానికి బానిసైపోతాడు. లేదా కొంత అటూ, కొంత ఇటూ డోలాయమాన స్థితిలో ఊగుతూ ఉంటాడు. కనుక ఒక విశ్వాసి ఇస్లామ్ ధర్మ సందేశాన్ని పూర్తిగా అవగాహన చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. ధార్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. దివ్య ఖుర్ఆన్‌తో సంబంధాన్ని దృఢ పరచుకోవాలి.

ఇస్లామ్ ధర్మం స్పష్టంగా బోధించే విషయం ఏమిటంటే, ఇహలోక జీవితం ఒక పరీక్షా కాలం. అసలు జీవితం పరలోక జీవితం. మనిషి మరణించగానే పరలోక జీవిత ద్వారం తెరచు కుంటుంది. ఇహలోకపు జీవిత ద్వారం మూసుకుంటుంది. పరలోకం కోసం సంపాదించుకునే సంపద అంతా ఇహలోకంలోనే ఉంది. పరలోకంలో సంపద మార్గాలు ఏమీ ఉండవు. కనుక పరలోకంలో ఎంత హాయిగా జీవించాలనుకుంటే అంతే ఎక్కువగా మీ సంపాదన ఉండాలి. కాని ఆ సంపాదన సంపా దించుకోవటం అంత సులువూ కాదు. అలా అని మరీ కష్టమూ కాదు. ఆగర్భ శత్రువైన షైతానుపై అదుపును సాధిస్తే చాలు.

ఒక బాటసారి మాదిరిగా జీవించాలి. ఒక ఓడ ప్రయాణించ టానికి నీరు చాలా అవసరం. నీరు లేనిదే ఓడ ఒక్క అంగుళం కూడా ముందుకు సాగదు. కనుక ఓడ చుట్టూ నీటిని ఉంచుకోవటం, నీటిపై ఓడను ఉంచటం వివేకం. కాని నీరే కదా ఓడకు జీవనాధారం అని ఓడ లోపలికి నీరు చేరేలా లేదా నీటిలోనే ఓడ మునిగిపోయేలా చేసినట్లయితే అది అవివేకం, ప్రాణాంతకం.

కనుక మనిషి తన జీవితాన్ని, జీవిత లక్ష్యాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. ఆలోచించాలి. తన సృష్టికర్తను విశ్వసించాలి, ఆయన బోధనలనే అనుసరించాలి. గడిచిపోయిన జీవితంలో జరిగిన లోపాలపై క్షమాపణ కోరుకోవాలి. మిగతా జీవితంలో తాను విశ్వసించిన విషయాలపై స్థిరంగా ఉండాలి. పరలోకాన్ని చక్కదిద్దుకోవాలి.

# యువ చైతన్యం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**మనిషి** మనుగడకు, చరిత్ర ఉత్తేజ మగుటకు సమాజాభివృద్ధికి యువతరం చాలా అవసరం. సమాజం నిరంతరం ప్రవహించే నదిలాంటిది. నదిలోకి వచ్చిన కొత్త నీరు పొలాల్లోకి ప్రవహించి సస్యశ్యామ లం చేస్తుంది. శరీరంలోకి కొత్త రక్తం ఎక్కినప్పుడు అది ఎలా పుష్టినిస్తుందో అలాగే ప్రతి యుగంలో జరిగే మార్పునకు యువత నవ్యత్వానికీ భవ్యత్వానికి తోడ్పడుతుంది. భారతదేశానికున్న గొప్ప సంపద యువత. యువశక్తి అద్వితీయ మైనది. అనన్య సామాన్యమైనది. ఆవేశాన్ని అరికట్టి ఆలోచనను పెంపొందించుకొని సరైన మార్గంలో యువతరం నడిస్తే మన దేశం స్వర్గ సదృశమే. ఆధారం లేనివారికి ఆసరాగా నిలవాలి. అర్హులైన వారికి ఆనందం పంచాలి. వ్యవహారిక శైలిలోనూ, భవిష్యత్తు వ్యవహారాలోచనలోనూ మార్పు రావాలి. విద్య, నైతిక విలువలు కలిసి ప్రయాణించాలి. చదువుతోపాటు మంచి సంస్కారం అలవడాలి. ఆకర్షణ కంటే హితమైనదానిని ఎంపిక చేసుకోవడం యువత నేర్చుకోవాలి. మత్తు పదార్థాల వలలో పడితే బయట పడటం దుర్లభమని, జీవితం అర్థాంతరంగా ముగుస్తుం దని, భవిష్యత్తు నాశనం అవుతుందనే విషయం గుర్తుంచుకోవాలి.

తల్లిదండ్రులు రేయింబవళ్లు చెమటోడ్చి సంపాదించిన సొమ్ముతో ఉన్నత చదువులు చదివిన యువతరంలో 20 శాతం మాత్రమే తమ లక్ష్యాల సాధనలో పయనిస్తున్నారని 40 శాతం యువకులు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోలేక సమాజాన్ని నిందిస్తూ అచేతనంగా ఉంటున్నారని ఒక సర్వేలో తేలింది. మరో 40శాతం యువత మద్యం, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలకు లోనై, అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆ సర్వే పేర్కొంది. ప్రత్యేకించి గత ఏడాది కాలంలో అసాంఘిక కార్యకలాపాల్లో యువకుల ప్రమేయం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుమని 16 ఏళ్ల వయస్సు దాటని నూనూగు మీసాల యువకులు మద్యం మత్తులో కూరుకుపోతున్నారు. మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న యువకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు పట్టుబడుతున్నవారిలో అత్యధికులు యువకులే ఉంటున్న తీరు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

### యువ చైతన్యమే సమాజానికి రక్ష..

దురలవాట్లు, పెడధోరణులకు అలవాటుపడిన యువకులను చైతన్యపరచవలసిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాలపైనా ఉంది. స్వచ్ఛంద సంస్థలు మొదలుకొని తల్లిదండ్రుల వరకు యువత నడవడికపై దృష్టిసారించాలి. డ్రగ్స్, మత్తు మందు, మద్యం, గంజాయి లాంటి మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణా మాలను వివరిస్తూ యువతను చైతన్యపరచాల్సి ఉంది. స్వాతంత్ర్య ఉద్యమాల కాలం నుంచి అనేక విముక్తి పోరాటాలకు, విప్లవోద్యమాలకు స్ఫూర్తిగా నిలిచి, నిన్నటి మొన్నటి అనేక హక్కుల సాధన పోరులోనూ యువత అగ్రగామి పాత్ర పోషించింది. ఇదీ యువతరం శక్తి. అలాంటి యువతను నిరాశ నిస్పృహలకు గురికాకుండా, దురలవాట్లకు లోనుకాకుండా కాపాడుకోవడం ద్వారా భావి సమాజాన్ని నిర్మించుకోవాలి.

అది ప్రియ ప్రవక్త (స) వారి పవిత్ర సన్నిధి. నూనూగు మీసాల ఓ యువకుడు సహాబా ప్రోగై ఉన్న ఆ సత్సమావేశంలో అందరికీ సగౌరవంగా సలాము చేసి ప్రవేశించాడు. మాట ప్రారంభిస్తూ - ప్రవక్త (స) వారినుద్దేశించి - యా రసూలల్లాహ్! తమరు నాకు వ్యభిచార అనుమతి ఇస్తారా? అని అడిగాడు.

ఒక్కసారిగా అక్కడున్న వారందరి మీద పిడుగు పడ్డట్టయింది. ప్రియ ప్రవక్త (స) ఉన్నారన్న గౌరవంతో మౌనంగా ఉన్నారే గానీ, కట్టలు తెంచుకున్న కోపంతో అందరూ చూపులతోనే నిప్పులు కురిపిస్తున్నారు. ప్రవక్త (స), కుర్రాడి దుస్సాహసానికి ఏం తీర్పు ఇవ్వనున్నారో? అని ఉత్కంఠభరితులై ఎదురు చూస్తున్నారు. ప్రశ్న

అడిగిన ఆ నవ యువకుడు సైతం సహాబా ముఖ కవళికలు మారడం చూసి బిత్తరపోయాడు.. తనకు ఎలాంటి సమాధానం వస్తుందోనన్న ఆందోళనకు గురై ఉన్నాడు..!! ప్రవక్త(స) వారి అధరాల నుంచి ప్రేమపూరిత పలుకులు జాలువారాయి. బాబూ! ఇటురా...! దగ్గరకొచ్చి కూర్చో..!!! సహాబా అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు.. నాలుగు తగిలించాల్సిందిపోయి నగుమోముతో పలుకరించడమా....! చెంపలు వాయించాల్సింది పోయి చెంతకు చేర్చుకోవడమా....బయటికి గెంటాల్సిందిపోయి లోనికి ఆహ్వానించడమా...! అంటూ తర్జనభర్జన పడుతున్నారు.

ప్రవక్త (స): చూడు బాబూ! నీ ప్రశ్నకు జవాబు ఇచ్చేముందు నా ప్రశ్నకు బదులివ్వు.

ప్రవక్త(స): బాబూ! ఏ కార్యం కోసం అయితే నీవు అనుమతి కోరుతూ ఇక్కడికి వచ్చావో ఆ కార్యాన్ని నీ తల్లికోసం ఇష్టపడతావా?

నవ యువకుడు: లేదు, లేదు.

ప్రవక్త (స) : పోని నీ చెల్లికోసం?

నవ యువకుడు: ఛీ, ఛీ.. కాదు, కాదు. సరే నీ పిన్ని కోసం?

నవయువకుడు: అపచారం! అపచారం! నా వారైన ఎవరి కోసమూ దీన్ని ఇష్టపడను (లోహాన్ని మలచాలంటే సుత్తి తీసుకొని కొడితే కుదరదు. ముందు వేడి చేయాలి. ఆ తర్వాత అనుకూలంగా మలచుకోవాలి). అలాగే ప్రవక్త ఇటువంటి కొన్ని ప్రశ్నలతో వ్యభిచారం అంటే అతనికే అసహ్యం కలిగేలా చేశారు. ఆ పిదప హితవు చేయడానికి సరైన సమయం ఇదేనని భావించి ఇలా అన్నారు, ప్రవక్త (స): చూడు బాబూ! నీవు ఎలాగైతే నీ తల్లి, చెల్లి, పిన్ని కోసం వ్యభిచారాన్ని ఇష్ట పడటం లేదో, అలాగే జనులు సైతం తమ తల్లి, చెల్లి, పిన్ని కోసం ఈ నీచకార్యాన్ని సుతరాము ఇష్టపడరు. కాబట్టి నా మాట విను. చెడు ఆలోచనల్ని విసర్జించు, సౌశీల్యవంతుడవని అన్పించుకో' అంటూనే తన మృదువైన చేయిని ఆ నవ యువకుడి రొమ్ముపై పెట్టి 'ఓ అల్లాహ్ ఈ నూనూగు మీసాల యువకుడిని సౌశీల్యవంతమైన జీవితం ప్రసాదించు' అని ఆశీర్వదించారు. దీవెనలు కురిపించారు. ఆ రోజు మొదలు ఆ యువకుడు సమకాలీకుల్లానే గొప్ప సౌశీల్యవంతుడనిపించు కున్నాడు. అటువంటి శీలవంతుణ్ణి మేము చూడలేదు అని అప్పటి ప్రజలు కితాబు ఇచ్చారు. ప్రవక్త(స) వారి కాలం నాటి ఈ సంఘటన వల్ల మనకు అవగతమయ్యేది ఏమిటంటే..

1) 'ప్రతిదీ భయపెట్టి, చెంపలు వాయించి చేపించాలి' అన్న థియరీ సరయైనది కాదు. పనులు ప్రేమతోనే సాధ్యమవుతాయి.

2) యువకుల్లో అధికశాతం టీజింగ్ చేసే స్వభావం ఉంటుంది. అంత మాత్రాన వాళ్ళు చెడ్డాళ్ళు, పనికిమాలినోళ్ళని కాదు అర్థం. యువకుల మనస్తత్వాలు తెలిసిన పేరెంట్స్, గురువులకి వారి టీజింగ్, పరిహాసంలో సైతం, గొప్ప ప్రతిభ కనబడుతుంది. ఆ మీదట వారిని ఉత్తమ హితవులతో గొప్ప పౌరులుగా తయారు చేస్తారు కూడా. అలాగే పని చేయటం లేదు అని నోరుపారేసు కోవడం, చేయి చేసుకోవడం మాని, ఆ పని ఎలా చేయాలో, ఆ పని చేయడం వల్ల ప్రయోజనం ఏమిటో ప్రేమగా విడమరచి చెబుతారు. భవిష్యత్తును భూతద్దంలో చూపించి బెదరగొట్టడం మాని జీవితాన్ని ప్రేమించడం. పవిత్ర జీవన మకరందాన్ని ఆస్వాదించడం నేర్పిస్తారు.

3) మన పిల్లలు మన వద్దకు వచ్చి సైన్స్ గురించి గానీ, కామర్స్ గురించి గానీ, సెక్స్ గురించి గానీ, సెన్సెక్స్ గురించి గాని, ప్రేమ గురించి గానీ, కామన్సెస్ గురించి గానీ, పెళ్ళి గురించి గానీ, జాతీయం గురించి గానీ, అంతర్జాతీయం గురించి గానీ చర్చించినపుడు- ఏమిటి నాన్సెన్స్ అని మనం విసుక్కోక అసలు వాళ్లు మనల్నే ఎందుకు సంప్రదించారు? మన పట్ల గౌరవం, మర్యాద లేకపోతే వారు మనతో ఇలా అడిగివారేనా? అని ఆలోచించాలి. మనల్ని వారు ప్రేమిస్తున్నారు. అభిమానిస్తున్నారు. గౌరవిస్తున్నారు. మన మాటకు విలువ ఇస్తున్నారు కాబట్టే తమ సమస్యలు మనతో వచ్చి చెప్పుకుంటున్నారు. కన్నవారం అయిన మనమే వారి మనోభావాల్ని అర్థం చేసుకోక, మరేదోలా భావించి దురుసుగా ప్రవర్తిస్తే పాపం వాళ్ళెక్కడికి వెళతారు? వారి మనోభావాల్ని అర్థం చేసుకుని, వారి సమస్యల్ని ఎవరు పరిష్కరి స్తారు? కనుక మన పిల్లలు మనతో చెప్పే మాటలు, వారికి ఎదురయ్యే సమస్యలు ఎంత తీవ్రమైనవైనా వాటికంటూ ఓ పరిష్కారం ఖచ్చితంగా ఉంటుంది.

మనం చేయాల్సిందల్లా ఓర్పు, నేర్పుతో వారి వాదనల్ని విని, పెద్ద మనసుతో అర్థం చేసుకొని, సమస్యను మన కోణం నుంచి కాకుండా, వారి కోణం నుంచి చూసి యోచించి యుక్తితో పరిష్కరించడమే. ఇది మీరు చెప్పేంత సులభం కాదు అని మీరు అనవచ్చు. మీరన్నది నిజమే కావచ్చు. కానీ ప్రయత్నిస్తే సాధ్యం కానిదంటూ ఈ లోకంలో ఏదీ లేదు. సాధనతో మన సంతానాన్ని సంరక్షించుకుంటామో, సోమరితనం, లక్ష్యం, అహంకారంతో పోగొట్టుకుంటామో మనమే నిర్ణయించుకోవాలి.



## గుజరాత్ ఎన్నికల కోసం పది మంది అభ్యర్థుల జాబితా ప్రకటించిన ఆప్

ఈ యేడాది చివర్లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మోదీ స్వరాష్ట్రంలో ఆప్ పాగా వేయాలని చూస్తుంది. ఇందులో భాగంగానే పది మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఇటీవల పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ జయకేతనం ఎగురవేసింది. అనంతరం ఆ పార్టీ గుజరాత్‌పై కన్నేసింది. గుజరాత్‌లో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, వచ్చే ఐదేళ్లలో ప్రతి నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఉద్యోగాలు కల్పించే వరకు ప్రతి నిరుద్యోగ యువకుడికి నెలకు రూ.3వేల భృతి ఇస్తామని, అలాగే నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు.

## ఢిల్లీ పోలీసులకు హైకోర్టు నోటీసులు

తనకు మధ్యంతర బెయిల్‌ను కింది కోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ జెఎన్‌యు విద్యార్థి షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్థానిక పోలీసులకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2019 డిసెంబర్‌లో జామియా ఇస్లామియాలో ఇమామ్ ప్రసంగించడంపై ఆయనపై దేశద్రోహం కేసు నమోదైంది. ఈ కేసులో విచారణను నిలిపివేసేందుకు కోర్టు నిరాకరించడాన్ని కూడా ఇమామ్ పిటిషన్‌లో పేర్కొనగా... ముక్తా గుప్తా, అనీష్ దయాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ నోటీసులిచ్చింది. ఈ వ్యవహారంపై రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. విచారణను ఆగష్టు 25కు వాయిదా వేసింది.

## రాజ్యాంగం తమకు కల్పిస్తున్న హక్కులేమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

దేశంలోని పౌరులంతా రాజ్యాంగం తమకు ప్రసాదించిన హక్కులు, విధులను తెలుసుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం వృద్ధి సాధిస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్నవారు సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను విడమర్చి చెప్పాలని సూచించారు. రాయ్‌పూర్‌లోని హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో జస్టిస్ రమణ పాల్గొన్నారు. ప్రస్తుత తరం యువతీ యువకులు అన్ని అంశాలపై ప్రపంచవ్యాప్తంగా ఏకీకృత శక్తిగా మారుతున్నారని పేర్కొన్నారు.

## మాలేగావ్ పేలుళ్ల కేసులో బీజేపీ ఎంపీ పాత్ర

మహారాష్ట్రలోని మాలేగావ్ పట్టణంలో 2008వ సంవత్సరంలో జరిగిన బాంబు పేలుళ్ల కేసులో ఫోరెన్సిక్ నిపుణులు సంచలన విషయాలు బయటపెట్టారు. ఈ పేలుళ్ల కేసులో భోపాల్ బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్‌కు లింక్ ఉందని ఫోరెన్సిక్ నిపుణుల బృందం తేల్చిచెప్పింది. మస్జిదు సమీపంలో పేలుడు జరిగిన స్థలంలో ఉంచిన ఒక ఎల్ఎంఎల్ వెస్పా స్కూటరు భోపాల్ బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ పేరుపై రిజిస్టర్ చేసి ఉందని ఫోరెన్సిక్ నిపుణులు ముంబయిలోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టుకు నివేదించారు. ఈ స్కూటరులో అమ్మోనియం నైట్రేట్ ను రికవరీ చేశామని ఫోరెన్సిక్ నిపుణులు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఈ పేలుళ్ల కేసులో 261 మంది సాక్షులను ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు విచారించింది.

## మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటే మనకూ శ్రీలంక పరిస్థితులే?



ప్రజాస్వామ్యం, దాని వ్యవస్థలను బలోపేతం చేయడంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక పురోగతికి ఇది కీలకమని పేర్కొన్నారు. నిరుద్యోగ సంక్షోభాన్ని పక్కదారి పట్టించేందుకు మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటే శ్రీలంక పరిస్థితులే తలెత్తుతాయని హెచ్చరించారు. 5వ ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ సదస్సులో ఆయన మాట్లాడారు. మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు చేసే ఎలాంటి ప్రయత్నమైనా దేశాన్ని ముక్కలు చేస్తుందని హెచ్చరించారు. శ్రీలంకలో సరిపడా ఉద్యోగాలు కల్పించడంలో విఫలమై.. దాన్ని కప్పిపుచ్చేందుకు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం వల్లే అక్కడ ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు.

## భారీగా క్షీణించనున్న ఉక్రెయిన్ జీడీపీ

ఉక్రెయిన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) భారీగా క్షీణించనుందని ఉక్రెయిన్ జాతీయ బ్యాంకు పేర్కొంది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఈ ఏడాది ఉక్రెయిన్ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 33.4 శాతం క్షీణించనుందని ఉక్రెయిన్ జాతీయ బ్యాంక్ తన ప్రాథమిక అంచనాను తాజాగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. జిడిపి క్షీణించడానికి సైనిక ఘర్షణలు, ప్రాణనష్టం, జనాభా వలసలు ప్రధాన కారణంగా బ్యాంక్ తెలిపింది. 2021లో 149.3 బిలియన్ డాలర్లుగా ఉన్న జిడిపి 2022లో 124.1 బిలియన్ డాలర్లకు దిగజారుతుందని ఉక్రెయిన్ జాతీయ బ్యాంక్ అంచనా వేసింది.

## సౌదీ అరేబియా కీలక ప్రకటన

ఉమ్రా యాత్రకు వచ్చే విదేశీ యాత్రికుల విషయమై సౌదీ అరేబియా తాజాగా కీలక ప్రకటన చేసింది. విదేశాల నుంచి ఉమ్రా కోసం వచ్చే యాత్రికులకు సౌదీ అరేబియాలో ప్రవేశించ డానికి పీసీఆర్ పరీక్ష అవసరం లేదని హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కానీ, కరోనా బారినపడితే చికిత్స వ్యయాన్ని కవర్ చేయడానికి బీమా తీసుకోవాలనే నిబంధన ఇప్పటికీ అలాగే ఉందని ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది. ఇక ఉమ్రా వీసాపై వచ్చేవారి బస వ్యవధి 90 రోజులు మాత్రమేనని తెలిపింది. యాత్రికులు మదీనా, మక్కాతో పాటు అన్ని ఇతర సౌదీ నగరాల మధ్య ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని వెల్లడించింది.

## పూర్తి స్థాయిలో కరోనా ఆంక్షలు ఎత్తివేసిన న్యూజిలాండ్

కరోనా ఆంక్షలన్నిటినీ పూర్తిస్థాయిలో ఎత్తేస్తున్నట్టు న్యూజిలాండ్ తెలిపింది. ఎటువంటి అడ్డంకులు లేకుండా వివిధ దేశాల పర్యాటకులు న్యూజిలాండ్‌కు రావచ్చని చెప్పింది. న్యూజిలాండ్ విద్యార్థి వీసా ఉన్నవారందరూ తమ దేశంలోకి ప్రవేశించవచ్చని తాజాగా పేర్కొంది. అంతేకాకుండా.. క్రూయిజ్ నావలను కూడా తమ పోర్టుల్లో నిలిపేందుకు అనుమతిచ్చింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. పూర్తిస్థాయిలో కరోనా టీకా తీసుకున్న వారినే దేశంలోకి అనుమతిస్తారు. అంతేకాకుండా.. పర్యాటకులు దేశంలోకి కాలు పెట్టాక తప్పనిసరిగా కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే..తప్పనిసరి క్వారంటైన్ నిబంధన నుంచి పర్యాటకులకు మినహాయింపు నిచ్చింది.



## అణు వినాశనానికి అడుగు దూరంలో ఉన్నాం

ప్రపంచం అణు వినాశనానికి అడుగు దూరంలో ఉందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ హెచ్చరించారు. ఒక చిన్న పొరపాటు జరిగినా, ఓ చిన్న తప్పుడు అంచనా వేసినా.. అణు విధ్వంసం జరుగుతుందని, దాని వల్ల మానవాళి ప్రమాదంలో పడుతుందని గుటెర్రెస్ తెలిపారు. అణ్వాయుధాల వ్యాప్తిని నియంత్రించే ఎన్పీటీ సంస్థ ఉన్నత స్థాయి సమావేశంలో గుటెర్రెస్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ప్రకటించిన పుతిన్ అంశాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించిన గుటెర్రెస్.. ప్రస్తుతం రష్యా అత్యంత శక్తివంతమైన అణ్వాయుధ దేశమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 13వేల అణ్వాయుధాలు ఉన్నాయని, ఆత్మరక్షణ పేరుతో చాలా వరకు దేశాలు అణు బాంబుల కోసం బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో అణ్వాయుధ సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమావేశంలో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు.

## శ్రీలంకకు నిధుల ఇచ్చే ఆలోచన లేదు

ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంకకు ప్రస్తుతానికి ఆర్థిక సహాయం అందించే ఆలోచన ఏదీ లేదని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. లంకలో తగిన స్థూల ఆర్థిక విధానానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్ ఏర్పడే వరకు సాధ్యం కాదని తెలిపింది. శ్రీలంకకు నిర్మాణాత్మకమైన సంస్కరణలు అవసరమని వరల్డ్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశంలో కొనసాగుతున్న సంస్కరణలు ఆర్థిక స్థిరీకరణపై దృష్టి పెట్టాలని సూచించింది. లంకలో ప్రస్తుత పరిస్థితికి కారణాలు గుర్తించి.. తొలగించాల్సిన అవసరం ఉందని, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు శ్రీలంక సరళమైన, సమ్మిళిత పద్ధతిలో అభివృద్ధి చెందే విధానాన్ని అవలంబించాలని పేర్కొంది.

## కాబా గిలాఫ్ మార్పు

ఈ యేడు కాబా గిలాఫ్ మార్చే ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. కాబా గిలాఫ్‌ను మార్చే ప్రక్రియను యాత్రికులు కన్నుల పండువగా తిలకించారు. ఈ కార్యక్రమంలో హరమైన్ షరీఫైన్ వ్యవహారాల ఉన్నతాధికారి షేఖ్ అబ్దుర్రహ్మాన్ అల్ సుదైస్ పాల్గొన్నారు. కాబా గిలాఫ్‌ను కిస్వా అంటారు. ముహర్రమ్ ఒకటవ తేదీన అంటే జులై 31వ తేదీన కాబా గిలాఫ్‌ను మార్చడం జరిగింది. ప్రతియేడు రమజాన్ మాసం సందర్భంగా ఇంకా ముహర్రమ్ మాసంలో కాబా గిలాఫ్‌ను మారుస్తారు.

# అధర్మమైన సొమ్ము

**హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(సఅసం) ఇలా చెప్పారు : "ప్రజలపై ఒక కాలం రానున్నది. అప్పుడు మనిషికి, తాను పుచ్చుకుంటున్నది ధర్మసమ్మతమైనదేనా? అధర్మమైనదా? అనేది పట్టదు." (సహీహ్ బుఖారీ)**

**సంగ్రహణం :**

బహుశా ఆ కాలం వచ్చేసినట్లే ఉంది. ధర్మాధర్మాలు, ఉచితానుచితాల విషయంలో జనులు మరీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంచి ధర్మావలంబీకులు, ఆధ్యాత్మిక వేత్తలుగా పరిగణించబడేవారు సయితం తమ వద్దకు వచ్చిన డబ్బు గురించి, అది హలాల్ సొమ్మేనా? కాదా? అని తనిఖీ చేయటం లేదు. రానున్న కాలం మరింత అధ్వాన్నంగా ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. 'ఆ సమయంలో ప్రజల దుఆలు ఆమోదించబడవు' అన్న వాక్యం వేరొక చోట అదనంగా ఉంది.

మనిషి ధర్మాధర్మాల మధ్య విచక్షణ పాటించటం మానుకున్నాడంటే అతనిలోని విశ్వాసం (ఈమాన్) నిర్జీవమైనట్లే. దైవ ప్రవక్త(స) గారి ఈ ప్రబోధనల ప్రభావం ప్రవక్త ప్రియ సహచరులపై ఎంతగా పడిందో ఈ రెండు సంఘటనల ద్వారా గ్రహించవచ్చు.

సహీహ్ బుఖారీలో వచ్చిన హజ్రత్ అబూబక్ర్(రజి) సంఘటన ప్రకారం, ఆయన బానిస తినే వస్తువొకటి అబూబక్ర్(రజి) ముందు సమర్పించాడు. ఆయన(రజి) అందులో నుండి కొంత తీసుకుని తిన్నారు. ఆ తరువాత బానిస ఇలా వివరించాడు : "ఇస్లాంకు పూర్వం- అజ్ఞాన కాలంలో- నేను ఒక వ్యక్తితో, నేను జోస్యం చెప్పేవాడినని అన్నాను. అతనికి ఏదో చెప్పాను కూడా. ఆ వ్యక్తి ఈ రోజు నాకు తారసపడ్డాడు. నేను చెప్పిన జోస్యానికి ప్రతిఫలంగా ఈ ఆహార పదార్థం ఇచ్చుకున్నాడు." ఈ సంగతి తెలియగానే హజ్రత్ అబూబక్ర్ (రజి) తన గొంతు లోపలికి వ్రేలు పెట్టి వాంతి చేశారు. తన కడుపులో ఉన్న ఆహార పదార్థమంతా కక్కేశారు.

ఇదేవిధంగా ఇమామ్ బైహఖీ గారు హజ్రత్ ఉమర్(రజి) సంఘటనను పొందుపరిచారు- ఒకనాడు ఒక వ్యక్తి హజ్రత్ ఉమర్(రజి) సేవలో పాలు సమర్పించాడు. దానిని ఆయన (రజి) స్వీకరించారు. పాలు త్రాగారు కూడా. మాటల మధ్యలో ఆయన ఆ వ్యక్తినుద్దేశించి, ఇంతకీ ఈ పాలు ఎక్కడివి? అని అడిగారు. దానికా వ్యక్తి, "ఫలానా పర్వత లోయ మీదుగా నేను వెళుతుండగా అక్కడ కొంతమంది జకాత్ ఒంటెల, జకాత్ మేకల పాలు పితుకుతూ కనిపించారు. నాకు కూడా పాలు ఇచ్చారు. ఇవి ఆ పాలే" అన్నాడు. ఈ మాట విన్నంతనే హజ్రత్ ఉమర్(రజి) నోట్లో వ్రేలుపెట్టి, కెలుకుతూ వాంతి చేశారు. ఆ విధంగా ఆయన కడుపులో ఉన్న పాలన్నీ బయటికి వచ్చేశాయి. (మిష్కాత్)

**తుది గీటు**




ఈ రెండు సంఘటనల ద్వారా కూడా తెలిసిందేమిటంటే ఆ మహనీయులిద్దరూ తెలీకుండా తిన్నారు, త్రాగారు. నిజానికి అది పాపం కూడా కాదు. కాని హరామ్ (అధర్మం) తో కడుపు నింపుకోవటం ఎంత తీవ్రమైన విషయమో వారు దైవప్రవక్త(సఅసం) నోట విని ఉన్నారు. కాబట్టి దానిని వెళ్ళగ్రక్కేవరకూ వారి మనసు కుదుటపడలేదు. నిశ్చయంగా 'తఖ్వా' అంటే అసలిదే.

**('హదీసు పరిమళం' పుస్తకంలో నుంచి)**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**